జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 138 | మంగళవారం 14 అక్టోబరు - 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

### ఆ రైతులు చేసిన త్యాగం

# ప్రపంచంలోనే చరిత్రాత్మకం:

## సీఎం చంద్రబాబు

- రాజధాని అమరావతిలో సీఆర్డీఏ నూతన భవనాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- గత ఐదేళ్లలో రైతులు పడిన కష్టాలు, అవమానాలు చూశానన్న సీఎం
- హైదరాబాద్ తరహాలో అమరావతిని స్వయం సమృద్ధి నగరంగా తీర్చిదిద్దుతామని హామీ
- రైతులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, అందుకు ప్రభుత్వం సహకరిస్తుందని పిలుపు

అమరావతి, అక్టోబరు 13 (సందేశం టైమ్స్) : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఐదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ నూతన అధ్యాయం ప్రారంభమైంది. సీఎం చంద్రబాబు సోమవారం రాజధాని ప్రాంతంలో నిర్మించిన సీఆర్డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ) కార్యాలయ భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ భవనం ప్రారంభం కేవలం ఆరంభం మాత్రమేనని, అమరావతి అభివృద్ధి ప్రస్థానం ఇప్పుడే మొదలైందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులను ఉద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేనని, వారికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.గత ఐదేళ్ల కష్టాలను గుర్తుచేసుకున్న సీఎంగత ఐదేళ్లలో రాజధాని రైతులు, ముఖ్యంగా మహిళలు పడిన కష్టాలను, అవమానాలను తాను కళ్లారా చూశానని చంద్రబాబు అన్నారు. రాజధానిని ఎడారిగా, స్మశానంగా



అభివర్ణించి అవహేళన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో...

### భారత్-అమెరికా

## వాణిజ్య ఒప్పందం తుది దశలో



అక్టోబరు 13 (సందేశం టైమ్స్) : భారత్ మరియు అమెరికా మధ్య జరుగుతున్న మొదటి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంత్వరలోనే తుది రూపం దాల్చే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారం కోసం భారత వాణిజ్య ప్రతినిధుల బృందం ఈ వారం వాషింగ్టన్‌కి వెళ్ళనుంది. ఒక సీనియర్ అధికారి ప్రకారం, "ఇరు దేశాలు సానుకూల వాతావరణంలో చర్చలు జరుపుతున్నాయి. నిర్ణయించిన గడువులోపు మొదటి దశ ట్రేడ్ డీల్‌ను ముగించడమే లక్ష్యం" అని తెలిపారు.

మార్కెట్ యాక్సెస్, ఇంధన వాణిజ్యంపై చర్చలు

భారత్–అమెరికా మధ్య జరగబోయే ఈ చర్చల్లో ప్రధానంగా మార్కెట్ యాక్సెస్, రెగ్యులేటరీ సహకారం, ఇంధన, సాంకేతిక రంగాల్లో వాణిజ్య విస్తరణ అంశాలపై దృష్టి కేంద్రీకరించనున్నారు. భారత ప్రభుత్వం ప్రత్యేకంగా అమెరికా నుంచి సహజ వాయువు మరియు పునరుత్పాదక ఇంధన టెక్నాలజీల దిగుమతులను పెంచుకోవాలని చూస్తోంది. ఇది భారత్‌కు క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్ లక్ష్యాలు సాధించడంలో, అలాగే ఇంధన వనరుల వైవిధ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

మిగతా 2లో...

### దగ్గుమందుతో చిన్నారుల మృతి..

## తమిళనాడులో కోల్డ్‌రిఫ్ కంపెనీ మూసివేత



**అనుమతులు రద్దు చేసినట్లు తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ విభాగం వెల్లడి రాష్ట్రంలోని ఇతర ఔషధ తయారీ సంస్థల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశంఇదిమరకే కంపెనీ యజమానిని అరెస్టు చేసిన దర్యాప్తు బృందం**

తమిళనాడు, అక్టోబరు 13 (సందేశం టైమ్స్) : కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ సంస్థ శ్రేసన్ ఫార్మా అనుమతులను తమిళనాడు ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు అనుమతులు రద్దు చేసినట్లు తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ విభాగం వెల్లడించింది. కంపెనీ మూసివేతకు కూడా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపింది. రాష్ట్రంలోని ఇతర ఔషధ తయారీ సంస్థల్లో తనిఖీలు నిర్వహిం చాలని ఆదేశించినట్లు పేర్కొంది.కోల్డ్‌రిఫ్ దగ్గు మందు కారణంగా మధ్యప్రదేశ్‌లో 20 మందికి

### విశాఖ సీఐఐ సదస్సు:

# జాతీయ, అంతర్జాతీయ నేతలకు లోకేశ్ ఆహ్వానం





- నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు
- విజయవంతం చేసేందుకు ఇప్పటికే రంగంలోకి దిగిన మంత్రి లోకేశ్
- జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు, నేతలకు ఆహ్వానాలు
- ముఖ్య అతిథిగా ప్రధాని మోదీని ఆహ్వానించాలని నిర్ణయం
- పెట్టుబడుల ఆకర్షణ, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంపే లక్ష్యమన్న సీఎం
- సదస్సుకు 40 దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యే అవకాశం

మిగతా 2లో...

### ఆదాయ వనరుల సమీకరణపై

## ఏపీ ప్రభుత్వం కసరత్తు





అమరావతి, అక్టోబరు 13(సందేశం టైమ్స్) : ఆదాయ వనరుల సమీకరణపై ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆదాయ వనరుల సమీకరణ కోసం ప్రత్యామ్నాయ మార్గాలని గుర్తించేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఆరుగురు మంత్రులతో మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ

మిగతా 2లో...

### ఏపీ పోలీసుల యాక్షన్..

## దిగొచ్చిన పేర్ని నాని





మచిలీపట్నం, అక్టోబరు 13(సందేశం టైమ్స్) : మచిలీపట్నం పోలీసులు యాక్షన్ చేపట్టడంతో మాజీ మంత్రి పేర్ని నాని దిగొచ్చారు. ఈ క్రమంలో పేర్ని నానితో సహా మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌కి క్యూ కట్టారు వైసీపీ నేతలు . ఇటీవల మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ వద్ద అనుమతులు లేకుండా ధర్నా చేశారు వైసీపీ నేతలు.ఈ క్రమంలో పోలీసుల అనుమతి లేకుండా ఆందోళన చేయడంతో 400 మంది వైసీపీ నేతలపై కేసు నమోదు చేశారు. సుమారు 100 మందికి 41ఏ నోటీసులు జారీ చేశారు. నోటీసులకు సమాధానం ఇవ్వకుండా మొన్నటి వరకు పోలీసులతో దోబూచులాడారు ఫ్యాన్ పార్టీ నేతలు. రెండు రోజుల క్రితం వైసీపీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న అరెస్ట్‌తో వైసీపీ నేతలు అలర్ట్ అయ్యారు.

### ఏపీ పర్యాటక రంగానికి

## జాతీయ గుర్తింపు దిశగా అడుగులు



అమరావతి, అక్టోబరు 13(సందేశం టైమ్స్) : ఏపీ పర్యాటక రంగానికి జాతీయ గుర్తింపు దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అక్టోబర్ 14, 15 తేదీల్లో పర్యటించనున్నారు. దేశంలో ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల 50 పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల కల్పన కోసం ఉద్దేశించిన జాతీయ మిషన్‌పై చర్చించేందుకు ఏపీ ప్రభుత్వం తరపున ప్రతినిధిగా వెళ్లనున్నారు మంత్రి కందుల దుర్గేష్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పర్యాటక,

మిగతా 2లో...

మొదటి పేజీ తరువాయి

## ఆ రైతులు చేసిన త్యాగం ప్రపంచంలోనే చరిత్రాత్మకం:

రైతులు రోడ్లపైకి వచ్చి పోరాడుతున్న సమయంలో, తాను కూడా 'జోలె పట్టి' వారికి అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ ఉద్యమ ఫలితమే ఈరోజు మళ్లీ ఇక్కడ సమావేశం కావడానికి కారణమని అన్నారు. "మీ కష్టాలు, మీ త్యాగాలు నేను చూశాను. ఆ త్యాగాల ఫలితాలను మీరు మళ్లీ అనుభవించడానికి నేను అన్ని విధాలా సహకరిస్తాను" అని రైతులకు భరోసా ఇచ్చారు.

హైదరాబాద్ మోడల్‌తో అమరావతి నిర్మాణం

హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు కూడా తన విజన్‌ను చాలామంది ఎగతాళి చేశారని, కానీ అదే నగరం నేడు తెలంగాణకు 70% ఆదాయాన్ని అందిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. "హైటెక్ సిటీ వద్ద ఎకరం లక్ష రూపాయలు పలికిన భూమి, ఈరోజు రాయదుర్గంలో రూ. 177 కోట్లకు చేరింది. అదే అనుభవంతో, ప్రభుత్వ ధనం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా, ఇక్కడి భూముల విలువను పెంచి, సెల్ఫ్-మానిటైజేషన్ పద్ధతిలో అమరావతిని నిర్మిస్తాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే ల్యాండ్ పూలింగ్ విజయవంతమైన ఏకైక చరిత్ర అమరావతి అని కొనియాడారు.

ప్రపంచస్థాయి నగరంగా అమరావతి

అమరావతికి ఉన్న భౌగోళిక అనుకూలతలను చంద్రబాబు వివరించారు. ఒకవైపు కృష్ణా నది (బ్లూ), మరోవైపు పచ్చని భూములు (గ్రీన్), ఆధునిక గ్రీన్ టెక్నాలజీ కలయికతో అమరావతి ప్రపంచంలోనే ఓ అద్భుత నగరంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. వరద నీరు, మురుగు నీరు, కేబుల్స్ వంటి అన్నింటికీ ప్రత్యేకంగా 'సర్వీస్ డక్ట్‌లు' ఏర్పాటు చేస్తున్నామని, ఇలాంటి అత్యాధునిక మౌలిక వసతులు దేశంలో ఏ నగరానికీ లేవని పేర్కొన్నారు.

## విశాఖ సీఐఐ సదస్సు: జాతీయ, అంతర్జాతీయ నేతలకు లోకేశ్ ఆహ్వానం

ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించి, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచానికి చాటే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన సీఐఐ భాగస్వామ్య సదస్సును విజయవంతం చేసేందుకు మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించారు. పలు దేశాల్లో పర్యటించి జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలకు, కీలక నేతలకు ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానాలు పంపుతూ సదస్సు విజయానికి మార్గం సుగమం చేస్తున్నారు. ఈ సదస్సు సన్నాహకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం అమరావతి సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా జరగనున్న ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావాలని, సరికొత్త ఆలోచనలకు ఇది వేదిక కావాలని ఆయన ఆకాంక్షించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దీంతో పాటు వివిధ దేశాల వాణిజ్య మంత్రులను, ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల సీఈవోలను కూడా సదస్సుకు పిలవాలని సీఎం అధికారులను ఆదేశించారు. 'టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్' అనే థీమ్‌తో జరగనున్న ఈ సదస్సులో మొత్తం 13 సెషన్లు నిర్వహించనున్నారు. ఇందులో రక్షణ, ఏరోస్పేస్, హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్ వంటి కీలక అంశాలపై చర్చలు జరుగుతాయి. జీ20 దేశాలతో పాటు యూరప్, ఆసియా, మధ్యప్రాచ్యం నుంచి దాదాపు 40 దేశాల ప్రతినిధులు, 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మందికి పైగా దేశ, విదేశీ సీఈవోలు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఏపీ పర్యాటక రంగానికి జాతీయ గుర్తింపు దిశగా అడుగులు

సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల పర్యాటక మంత్రులు హాజరుకానున్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ 2025 - 2026 ప్రకటనల అమలుపై ఏపీ విజన్‌ను సమర్పించనున్నారు మంత్రి దుర్గేష్. జాతీయ మిషన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ తరపున ఉన్న ప్రతిపాదనలను వివరించనున్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎంపిక చేసిన ప్రధాన పర్యాటక గమ్యస్థానాలను రాష్ట్రాల భాగస్వామ్యంతో 'ఛాలెంజ్ మోడ్'లో అభివృద్ధి చేయనుంది కేంద్రం ప్రభుత్వం. పర్యాటక సౌకర్యాలు, పరిశుభ్రత, మార్కెటింగ్ ప్రయత్నాలతో సహా సమర్థవంతమైన గమ్యస్థానాల నిర్వహణ కోసం పలు రాష్ట్రాలకు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు అందించనుంది కేంద్రం ప్రభుత్వం.

## ఆదాయ వనరుల సమీకరణపై ఏపీ ప్రభుత్వం కసరత్తు

ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేబినెట్ సబ్ కమిటీలో సభ్యుడిగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఉన్నారు. జీవోఎం సభ్యులుగా మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, జీవోఎం సభ్యులుగా మంత్రులు కందుల దుర్గేశ్, వంగలపూడి అనితలని కూటమి ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో ఆదాయ వృద్ధికి ప్రత్యామ్నాయ చర్యల గుర్తింపు, అమలుపై చర్చించాలని ఆదేశాలు జారీ చేసింది. నెలవారీ ఆదాయాలను, లక్ష్యాలతో పోల్చి సమీక్షించాలని ఆజ్ఞాపించింది. ఆదాయ పనితీరును మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన సంస్కరణలపై సిఫార్సు చేయాలని దిశానిర్దేశం చేసింది. ఏపీ ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన మార్పులు, సాంకేతికత అమలుపై సిఫార్సులు చేయాలని మార్గనిర్దేశం చేసింది. ఆదాయ వనరుల పెంపు కోసం పరిపాలనా పరంగా బలోపేతం చేయడంపై చర్చించాలని సూచించింది. ఆదాయ వనరుల పెంపుకోసం చట్టాలు, నియమాలు, విధానాలకు సవరణల అవసరాన్ని సమీక్షించాలని ఆదేశాలు జారీ చేసింది ఏపీ ప్రభుత్వం.

పలు ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని ఆజ్ఞాపించింది. పలు ప్రభుత్వ విభాగాల్లో విధానపరమైన అడ్డంకులని పరిష్కరించాలని సూచించింది. స్వర్ణాంధ్ర - 2047 దార్శనికతకు అనుగుణంగా మధ్యస్థ, దీర్ఘకాలిక ఆదాయ వ్యూహాలపై దిశానిర్దేశం చేయాలని ఆదేశించింది.

# ప్రజావాణి దరఖాస్తులు 57



(సందేశం టైమ్స్) సూర్యాపేట,13.10. 2025 ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను జిల్లా అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కే. సీతారామారావు ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరెట్ సమావేశ మందిరంలో ప్రజవాణి లో పాల్గొని ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్లో ఉన్నా వాటి పై దృష్టి సారించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నేడు నిర్వహించిన ప్రజవాణి లో భూములకు సంబంధించి 20 ఫిర్యాదులు, డి పి ఓ కి 6,మున్సిపల్ కమిషనర్ లకి 6, స్త్రీ మరియు శిశు సంక్షేమ అధికారికి 4, ఇతర అధికారులకు 21 ఫిర్యాదులు మొత్తం 57 ఫిర్యాదులు వచ్చాయని వీటన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని, జాగ్రత్తగా అన్నిటిని పరిశీలించి ఆలస్యం చేయకుండా వేగంగా పరిష్కరించెందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. డిఆర్ డి ఏ పి డి వి వి అప్పారావు, హౌజింగ్ పి



డి సిదార్ధ, డి ఎం హెచ్ ఓ చంద్రశేఖర్, డి సి ఓ పద్మ, డి ఇ ఓ అశోక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, సంక్షేమ అధికారులు దయా నంద రాణి, శంకర్, శ్రీనివాన్, నరసింహారావు , పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి,సూపర్టీడెంట్లు,అధికారులు, సిబ్బంది తదితరులు ప్రజావాణి కార్యక్రమానికిహాజరుయ్యారు

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లుఅదనపు కలెక్టర్ మాధురి






(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13అక్టోబర్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ మాధురి (రెవిన్యూ) తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్ల గురించి సోమవారం హైదరాబాదు నుంచి కన్స్యూమర్ అఫైర్స్ సివిల్ సప్లై డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్టీఫెన్ రవీంద్ర అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఐకెపి తరపున101, పిఎసిఎస్ కు సంబంధించి 88, డి సి ఎం ఎస్ తరపున 26 , ఎఫ్ పి ఓ 01,మొత్తం 216 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 195 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, అందులో సన్న రకం 20 వేల మెట్రిక్ టన్నులు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన గన్ని సంచులు, తూకాలు, తేమ నిర్ధారణ యంత్రాలు, తదితర కొరత లేకుండా చూస్తామన్నారు. గతేడాది ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వచ్చిన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ సీజన్లో తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల, పిపిసి స్థాయిలోనూ సూపర్వైజర్స్ టీమ్స్ ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్లో డి ఎమ్ సివిల్ సప్లై అధికారి అంబదాస్ రాజేశ్వర్ , జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ , జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్, పి డి డిఆర్డిఏ జ్యోతి, తూనికలు కొలతల శాఖ అధికారులు, తదితరులుపాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంలో పారదర్శకత, జవాబుదారీతనం ఆవశ్యకం

## పి .ప్రావీణ్య ,జిల్లా కలెక్టర్.

### కలెక్టరేట్ లో సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు.





(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13అక్టోబర్ సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార, సహాయ ప్రజా సమాచార అధికారులతో సమాచార హక్కు చట్టం - 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడారు ... ప్రతి సమాచార హక్కు చట్టంలో పారదర్శకత, జవాబుదారీతనం ఆవశ్యకమని, సమాచార హక్కు చట్టం నిర్వహణలో పారదర్శకత ప్రామాణికమని, అభ్యర్థులు దరఖాస్తు ద్వారా కోరిన సమాచారాన్ని చట్టం నిబంధనలకు లోబడి అధికారులు వ్యవహరించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం, అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార, సహాయ ప్రజా సమాచార అధికారుల వివరాలతో బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని అన్నారు. ఈ చట్టం అమలు ద్వారా పని సామర్థ్యం పెరుగుతుందని, దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా అందించాలని తెలిపారు. ఈ చట్టంలో పొందుపర్చిన మినహాయింపులు తప్ప మిగతా అన్ని విషయాల్లో ప్రజలు కోరిన సమాచారాన్ని చట్టం ప్రకారం అందించాలి. సమాచార హక్కు చట్టం 2005 ద్వారా సామాన్య ప్రజలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం తెలుసుకునే వెసులుబాటు కలిగిందన్నారు. ఈ చట్టం కింద వచ్చినా ఈ చట్టం కింద వచ్చిన దరఖాస్తులను నిర్మిత గడువు లోగా సమాచారం అర్జీదారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ ,మాధురి ,నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి ,సంబంధిత అధికారులు తదితరులుపాల్గొన్నారు.



# సంపాదకీయం

## వైద్యానికి శస్త్రచికిత్స

కోతికి కొబ్బరికాయ దొరికినట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో వైద్య కళాశాలల వ్యవహారాన్ని ప్రతిపక్షం అందిపుచ్చుకుంది. తాము ప్రభుత్వపరంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటుపరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా హడావిడి చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వం కూడా ఈ విషయంలో కొంత తొందరపాటు ప్రదర్శించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుకావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు మోడల్‌లో నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు కారణాలను సహేతుకంగా వివరించకుండా హడావిడిగా నిర్ణయం తీసుకోవడంతో ప్రతిపక్షం చేతికి అస్త్రం లభించింది. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయం సరైనదా? కాదా? అన్నది ఇప్పుడు పరిశీలిద్దాం. వైద్య కళాశాలల అవసరం ఏ మేరకు ఉంది? ఇబ్బడిముబ్బడిగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేసుకుంటూ పోతే ఫ్యాకల్టీ పరిస్థితి ఏమిటి? వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయమా? సంక్షేమం పేరిట బడ్జెట్‌లో సింహభాగం ఖర్చు చేస్తున్న ఈ రోజుల్లో ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి, నిర్వహించడం సాధ్యమా? ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో పలు కళాశాలలు ఉన్నప్పటికీ ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల్లోనే చేరడానికి విద్యార్థులు ఎందుకు పోటీ పడుతున్నారు? వంటి ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఎందుకు ఆకర్షితులవుతున్నారన్నది కూడా కీలక ప్రశ్నగా ఉంది. కాలమాన పరిస్థితులను బట్టి ఆలోచనలు, విధానాలు మారుతుంటాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ప్రభుత్వ రంగమే దిక్కుగా ఉండేది. అందుబాటులో ఉన్న పరిమిత వనరులతోనే దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పలు ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేశారు. విద్యాసంస్థలను నెలకొల్పారు. ప్రభుత్వం వద్ద ఉన్న నిధులతోనే నీటి ప్రాజెక్టులను కూడా దశలవారీగా నిర్మించారు. పంచవర్ష ప్రణాళికలను రచించుకొని అమలు చేశారు. ఆ తర్వాత ఇందిరాగాంధీ కూడా దాదాపుగా ఇవే విధానాలను కొనసాగిస్తూ సంక్షేమంపై కూడా దృష్టి పెట్టారు.రాజభరణాలు రద్దు చేయడంతో పాటు ప్రైవేటు రంగంలో ఉన్న బ్యాంకులను జాతీయం చేశారు. ఇందిరాగాంధీ తదనంతరం ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు మారాయి. రక్షిత ఆర్థిక వ్యవస్థకు, ప్రభుత్వ రంగం అన్న వాదనకు కాలం చెల్లింది. పోటీతత్వం పెరగడంతో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు బ్యాంకులను జాతీయం చేయగా, ఇప్పుడు ప్రైవేటు బ్యాంకులను ప్రోత్సహించే పరిస్థితి! అదే సమయంలో ప్రభుత్వ రంగంలో జవాబుదారీతనం లోపించింది. నెహ్రూ హయాంలో హైదరాబాద్‌లోని బాలానగర్ వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాసూటికల్స్ సంస్థ (ఐడీపీఎల్) ఏర్పాటైంది. ప్రస్తుత ఫార్మా దిగ్గజాలైన మురళి, డాక్టర్ అంజిరెడ్డి, పార్థసారధి రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి వంటి వారందరూ అందులో పనిచేసినవారే. ఐడీపీఎల్‌లో తమ పరిస్థితి ఎదుగూబొదుగూ లేకుండా ఉండటంతో అందులో పనిచేసిన పలువురు బయటకు వచ్చి సొంతంగా ఫార్మా కంపెనీలను ప్రారంభించి ఇవాళ కుబేరుల జాబితాలో చేరారు. ఐడీపీఎల్ మాత్రం చాలాకాలం క్రితమే మూతపడింది. ప్రభుత్వ రంగం అని పట్టుకొని వేళాడితే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పేందుకు ఈ సంస్థే నిదర్శనం. టెలికమ్యూనికేషన్ రంగాన్నే తీసుకుందాం. ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉండేది. అప్పుడు టెలిఫోన్ కనెక్షన్ కోసం నెలలు, సంవత్సరాలు వేచి చూడవలసి వచ్చేది. ఈ రంగంలోకి ప్రైవేటు సంస్థలు ప్రవేశించడంతో పరిస్థితిలో ఎంత వేగవంతమైన మార్పు వచ్చిందో చూస్తున్నాం. ఫోన్ కనెక్షన్ల కోసం మన చుట్టూ తిరుగుతున్నారు. ఏ రంగంలోనైనా మార్పునకు శ్రీకారం చుట్టినప్పుడు వ్యతిరేకత రావడం సహజం. మార్పు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తే అర్థం చేసుకుంటారు. టెలికమ్యూనికేషన్ రంగాన్ని ప్రైవేటుపరం చేసినప్పుడు కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ రంగంలో బీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉండాలని పట్టుబట్టాయి. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే నాటి మార్పును వ్యతిరేకించిన కమ్యూనిస్టు పార్టీలే దేశంలో బలహీనపడ్డాయి. ప్రైవేటు రంగంలోని టెలికాం కంపెనీలు దూసుకుపోతున్నాయి. ప్రజలకు కూడా సౌకర్యాలు మెరుగయ్యాయి. గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఉత్సుకత చూపిస్తున్నారు. ఇవాళ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉంటాయి. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. అయినా ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేకపోవడానికి కారణం ఏమిటి? ప్రభుత్వ రంగంలో జవాబుదారీతనం లోపించడం ప్రధాన కారణం. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజల్లో విశ్వాసం కలగడం లేదు. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించడమే సరైన నిర్ణయం. మారిన పరిస్థితులలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించవలసి వచ్చింది. ఇప్పటి పరిస్థితులకు పబ్లిక్%-%ప్రైవేటు భాగస్వామ్యమే సరైనది. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ పేరిట నెహ్రూ హయాంలో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థలలో వాటాలను విక్రయిస్తున్నది. దీన్ని విమర్శించే వారు ఉన్నప్పటికీ ప్రజలు పట్టించుకోవడం లేదు. ఈ నిర్ణయం ప్రభావం రాజకీయాలపై కూడా కనబడటం లేదు.మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం శక్తికి మించి అప్పులు చేసి అయినా ఖర్చు చేయడానికి ప్రజలు కూడా సిద్ధపడుతున్నారు. ప్రపంచీకరణ కారణంగా పోటీతత్వం పెరిగింది. ప్రభుత్వ రంగమైనా, ప్రైవేటు రంగమైనా పోటీ పడక తప్పని పరిస్థితి. పోటీ పడలేని ప్రైవేటు సంస్థలు కూడా కనుమరుగవుతున్నాయి. బూజు పట్టిన సిద్ధాంతాలు, కాలం చెల్లిన విధానాలకు ఇప్పుడు చోటు లేదు. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడాల్సిందే. విశ్వవిద్యాలయాలనే తీసుకుందాం.

# ఉద్యోగాల కోసం యువతకు పెద్ద అవకాశం


## ఈ నెల 25న హుజూర్నగర్‌లో భారీ జాబ్ మేళా



సూర్యాపేట, అక్టోబర్ 13 (సందేశం టైమ్స్)నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 25న హుజూర్నగర్‌లో భారీ జాబ్ మేళా జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు ఇండస్ట్రీస్ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని, రాష్ట్ర నీటి పారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హుజూర్నగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ "నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, యువతకు ఉపాధి కల్పించేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ జాబ్ మేళా నిర్వహణకు నిర్ణయించాం," అని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాను సింగరేణి కంపెనీ మరియు పరిశ్రమల శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఇందులో 150 కంపెనీలు పాల్గొని, ఐటీ, సేవా, నిర్మాణ, వాణిజ్య, ఫార్మా రంగాల్లో సుమారు 3,000 ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 2018 నుండి 2026 వరకు పది, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏలో ఉత్తీర్ణులైన యువత పాల్గొనవచ్చని వివరించారు. హుజూర్నగర్‌లోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్లో ఈ జాబ్ మేళా జరుగుతుందని చెప్పారు. డీట్ (DEET - Digital Employment Exchange of Telangana) ప్రతినిధి వంశీ మాట్లాడుతూ ఈ జాబ్ మేళా పోస్టర్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ద్వారా ఆవిష్కరించి, QRకోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం కల్పించనున్నామని తెలిపారు. అభ్యర్థులు కనీస వివరాలతో 5 రిజ్యూమ్ కాపీలు తీసుకురావాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లు అవసరం లేదని సూచించారు. జాబ్ మేళాకు వచ్చే యువతకు సౌకర్యాల కోసం హెల్ప్ డెస్క్, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు, మరియు స్థానిక కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి నిర్వాహకులకు ఆదేశించారు. సమీక్షా సమావేశంలో హుజూర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, సింగరేణి ప్రతినిధులు శ్రీకాంత్, చందర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి శంకర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు తదితరులుపాల్గొన్నారు.

# పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని వినతి






(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13అక్టోబర్ సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని వివిధ గ్రామల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని సోమవారం వివిధ గ్రామాల కు చెందిన దళితులు తహసీల్దార్ ఆశ జ్యోతి కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతం లో తహసీల్దార్ ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి రోజు పోలీస్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం దళిత వాడల్లో నిర్వహించేవారన్నారు. గ్రామాల్లోని దళిత వాడల్లో సమావేశాలు నిర్వహించి రెండు గ్లాసుల పద్ధతి, కుల దూషణ, వివక్ష తదితర అంశాల పై విచారణ జరిపేవారన్నారు. అదేవిధంగా పౌర హక్కులు, ప్రభుత్వ చట్టాలు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేవారన్నారు. గత కొన్ని నెలలుగా పౌర హక్కుల పరిరక్షణ కోసం ఎలాంటి సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించలేదన్నారు. కావున నిలిచి పోయిన సివిల్ రైట్స్ డే (పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం ) సమావేశాలు నిర్వహించి సమాజంలో పౌరుల మధ్య తారతమ్యాలు లేకుండా సామాజిక సమానత్వంతో ప్రజలంతా కలిసిమెలిసి ఉండేవిధంగా పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం నిర్వహించి అవగాహన కలిపించాలని కోరారు. ఆ మేరకు వినతి పత్రం అందుకున్న తహసీల్దార్ సనుకులంగా స్పందించి, సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమం లో మ్యాథరి ప్రవీణ్, సాంసన్,యాదల్ ,కె.రాజు,ఆనంద్, తదితరులుఉన్నారు.

# పోలీస్ ఫ్లాగ్ డే పురస్కరించుకుని విద్యార్థుల కోసం

## ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్



(సందేశం టైమ్స్)సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13:పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో విద్యార్థుల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.ప్రతి ఏడాది అక్టోబర్ 21న "పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం"గా జరుపుకుంటూ, దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నది. వాటిలో భాగంగానే ఈ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో నిర్వహించబడతాయి. 6వ తరగతి నుండి పీజీ వరకు చదివే విద్యార్థులు పాల్గొనవచ్చు. పోటీలో పాల్గొనదలచిన వారు అక్టోబర్ 31వ తేదీ లోపు తమ వ్యాసాన్ని ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వ్యాస రచన అంశం:Drugs Menace: Role of Police in Prevention and How Students Can Stay Away from Drugs='(డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర మరియు విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు). పోటీలో పాల్గొనాలనుకునే విద్యార్థులు ఈ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలి. అభ్యర్థులు తమ వ్యాసాన్ని 500 పదాల్లో మించకుండా పేపర్‌పై రాసి, జెపీజీ లేదా పిడిఎఫ్ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలి.జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన 1వ, 2వ, 3వ స్థానాలలో ఉన్న వారికి బహుమతులతో పాటు రాష్ట్రస్థాయికి ఎంపిక చేసే అవకాశముందని అధికారులు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని ఎస్పీపిలుపునిచ్చారు

# సివిల్ వివాదాల్లో పోలీసులు తల దూర్చవద్దు గీత దాటితే వేటు తప్పదు డీజీపీ శివధర్ రెడ్డి



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 13అక్టోబర్ సివిల్ వివాదాల్లో పోలీసులు తలదూర్చవద్దని, సివిల్ వివాదా లను పరిష్కరించిన పోలీసు స్టేషన్లు, సంబంధిత అధికా రులపై తక్షణమే వేటు పడుతుందని డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. హెూం గార్డు నుంచి ఐపీఎస్ అధికారి వరకూ ఎవరూ సివిల్ వివాదాల్లో తల దూర్చవద్దని కోరుతూ రాష్ట్ర పోలీసులనుద్దేశించి రాసిన అంతర్గత లేఖలో శివధర్ రెడ్డి పేర్కొన్నారు. సివిల్ వివాదాలు సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయన్న సంగతి ప్రతి పోలీసుకూ తెలుసునని, అయినా వాటిపై దృష్టి సారించే అధికారు లపై కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. పోలీసు యూనిఫామ్, అవినీతి కలిసి ఉండకూడదన్న డీజీపీ.. అవినీతి, అక్రమాలపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సిన పోలీసులే అవినీతికి పాల్పడితే ప్రజల్లో నమ్మకం పోతుందనిచెప్పారు..

# పల్నాడులో మెలియాయిడోసిస్ కలకలం.




పల్నాడు: జిల్లాలో మెలియాయిడోసిస్ వ్యాధి కలకలం రేపింది. వెల్దుర్తి మండలం దావుపల్లితండాలో జ్వరంతో బాధపడుతున్న వ్యక్తికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. మెలియాయిడోసిస్ పాజిటివ్‌గా బయటపడింది. దీంతో రోగిని అధికారులు మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ మేరకు గ్రామంలో జిల్లా వైద్యాధికారి రవి పర్యటించారు.

ఈ సందర్భంగా వైద్యాధికారి రవి మాట్లాడుతూ.. మెలియాయిడోసిస్ అంటు వ్యాధి కాదని స్పష్టం చేశారు. గ్రామస్థులు భయపడవద్దన్న సూచించారు. ఇప్పటికే గుంటూరు జిల్లా తురకపాలెంను మెలియాయిడోసిస్ వ్యాధి వణికించిన విషయం తెలిసిందే. గుంటూరు జీజీహెచ్‌లోని చికిత్స పొందుతున్న తురకపాలేనికి చెందిన ఆరుగురిలో ఒకరికి మెలియాయిడోసిస్ పాజిటివ్‌గా తేలింది. 46 ఏళ్ల ఆ వ్యక్తి మోకాలిలోని ద్రవాన్ని సేకరించి పరీక్షకు పంపించగా ఈ వ్యాధి నిర్ధారణ అయింది.

# బల్క్ డ్రగ్ నిలుపుదల చేయాలని .. రోడ్డెక్కిన మత్స్యకారులు



నక్కపల్లి (అనకాపల్లి) : మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట మత్స్యకారులు రోడ్డెక్కారు. నక్కపల్లి జాతీయ రహదారిపై బైఠాయించి %౦% బల్క్ డ్రగ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకఅష్ణ, ఉమాదేవి లను తాము తలపెట్టిన ఆందోళన శిబిరానికి రానీయకుండా పోలీసులు ఆంక్షలు విధించి, గఅహనిర్బంధాలు చేసి అడ్డుకున్నారని, వారందరిని తీసుకురావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సెక్షన్ 30 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ %౦% బల్క్ డ్రగ్ నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు 29 రోజుల నుండి శాంతియుతంగా రిలే దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మత్స్యకారులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం దిగివచ్చి బల్క్ డ్రగ్ ను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనికి ముందు రాజయ్యపేట నుండి మత్స్యకారులంతా నక్కపల్లి జాతీయ రహదారిని దిగ్బంధించేందుకుగాను ర్యాలీగా బయలుదేరి వస్తుండగా పోలీసులు ఎక్కడికక్కడ నిలువరించాలని ప్రయత్నం చేసినప్పటికీ, మత్స్యకారులు ఆ అడ్డంకులను అధిగమించి నక్కపల్లికి తరలివచ్చి రోడ్డుపై బైఠాయించారు. దీంతో కనుచూపుమేర జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి.

# పౌల్ట్రీ ఫాంను తొలగించాలని గ్రామస్తుల నిరసన



పెందుర్తి (విశాఖ) :అక్టోబర్ 13(సందేశం టైమ్స్): దువ్వపాలెం గ్రామంలో పౌల్ట్రీ ఫామ్ ను తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు అందరూ రోడ్డు మీద బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సంఘం నాయకులు మాట్లాడుతూ . ప్రతి ఇంటిలో ఈగలు ఎక్కువగా వచ్చి చేరుతున్నాయని, గ్రామస్తులు రోగాల బారినపడి మఅతి చెందారని అన్నారు. పౌల్ట్రీ ఫారంను వెంటనే తొలగించాలని కోరారు. యాజమాన్యానికి ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సోమవారం నుండి చేయవలసిన కార్యాచరణ కార్యక్రమాన్ని కూడా రూపొందించుకుంటున్నామని వెల్లడించారు.

# శిక్షణ సరే.. కుట్టుమిషన్లు ఏవీ



(అమరావతి-అక్టోబర్ 13(సందేశం టైమ్స్):రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమశాఖ ద్వారా 65వేల మందికి కూటమి ప్రభుత్వం కుట్టుశిక్షణ ఇప్పించింది. అయితే, శిక్షణ పూర్తయి నెలలు గడుస్తున్నా వారికి ఇస్తామన్న కుట్టుమిషన్లు పంపిణీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి తొలుత లక్ష మంది బీసీ, ఈబీసీ మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు పంపిణీ చేయాలని సంకల్పించగా 3,43,413మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 680 కేంద్రాలను ఏర్పాటుచేసి 1326బ్యాచ్‌ల ద్వారా 65,987 మందికి మొదట శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించారు. ప్రతి జిల్లాలో ఆయా మండల/మున్సిపాలిటీల్లో అవసరమైన వసతులతో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కుట్టు మిషన్లు, ఇతర సామగ్రి సమకూర్చడంతోపాటు ఆయా సంస్థల ద్వారా అనుభవజ్ఞులైన ట్రైనర్లను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఈడబ్ల్యూఎస్ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కేంద్రాలను సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి సవితతో పాటు పలువురు మంత్రులు సందర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించారు. శిక్షణా కేంద్రాల్లో వసతులను ఎంపీడీవోలు పర్యవేక్షించారు. శిక్షణ పొందిన ప్రతి మహిళకూ కుట్టుమిషన్ ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో భారీసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. చివరికి శిక్షణకు హాజరయ్యే వారికి మాత్రమే మిషన్లు ఇస్తామని నిబంధనలు కఠినతరం చేశారు. దీంతో వాస్తవంగా శిక్షణ పొంది కుట్టుమిషన్ల ద్వారా జీవనభృతి పొందాలనుకున్న మహిళలు మాత్రమే హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న మహిళందరికీ శిక్షణ ఇచ్చే పరిస్థితులు లేకపోవడంతో వడపోతతో ఎంపిక చేశారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సిఫారసులు చేస్తుండటంతో డిమాండ్ పెరిగిపోయింది. మహిళల నుంచి ఇంకా స్పందన వస్తుండడంతో పీ4 కింద శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమకు ఇస్తామన్న ఉచిత కుట్టుమిషన్లు అందిస్తే.. తమకాళ్లపై తాము నిలబడతామని ఎదురు చూస్తున్నా, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. అడగకపోయినా తమకోసం ఏటా రూ.2వేల కోట్లు వెచ్చించి ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. ఇస్తామన్న కుట్టుమిషన్లు ఇవ్వకుండా జాప్యం చేయడం ఏంటని మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# శేషచలంలో శ్రీగంధం చెట్లు నరికిన వ్యక్తి అరెస్టు



తిరుమల :అక్టోబర్ 13(సందేశం టైమ్స్): శేషచలంలో శ్రీగంధం చెట్లు నరికేందుకు యత్నించిన వ్యక్తిని ఫారెస్ట్ బేస్ క్యాంప్ సిబ్బంది పట్టుకున్నారు. జపాలీ తీర్థం సమీప అటవీప్రాంతంలో నిందితుడి నుండి 3 శ్రీగంధం చెట్టు వేరు భాగాలు(మొట్లు), రంపాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని తిరుపతికి తరలించి ఫారెస్ట్ అధికారులు విచారిస్తున్నారు.

# ఆహార ధాన్యాల సాగు బాగు

**పెరిగిన వరి, అపరాలు, చిరుధాన్యాల సాగు**

**అన్నదాతను ఆదుకున్న జలాశయాలు**

**వర్షాలు గతి తప్పి.. రైతుకు ఆటుపోట్లు**

**పత్తి, వేరుశనగ, నూనెగింజల విస్తీర్ణం తగ్గుదల**

**ఖరీఫ్ సీజన్‌లో మిశ్రమ ఫలితాలు**



(అమరావతి, అక్టోబర్ 13(సందేశం టైమ్స్):ఖరీఫ్ సాగు ముగింపు దశకు వచ్చింది. వర్షాలు గతి తప్పి రాష్ట్రంలో ఈ సీజన్‌లో రైతులు అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చినా నెలన్నర పాటు వర్షాలు సరిగ్గా కురవక, పంటల సాగు మందకొడిగా సాగింది. అయితే, జూలై 15 తర్వాత వర్షాలు కొంత ఆశాజనకంగా కురిశాయి. ఆగస్టు, సెప్టెంబరులో వరుస అల్పపీడనాలతో విస్తారంగా వర్షాలు పడ్డాయి. దీంతో ఖరీఫ్ సాగుపుంజుకుంది. మొత్తమ్మీద సాగులో మిశ్రమ ఫలితాలు కనిపించాయిరాష్ట్రవ్యాప్తంగా జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 616.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 579 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోస్తాంధ్రలో 696.27 మిల్లీమీటర్లు 661.59 మిల్లీమీటర్లు, రాయలసీమలో 438.01 మిల్లీమీటర్లు 483.56 మిల్లీమీటర్ల వాన పడింది. రాష్ట్రంలో ఈ సీజన్‌లో సగటున 51 రోజులు వర్షాలు కురిశాయి. కొన్ని జిల్లాల్లో 20నుంచి 63రోజులు వానలు పడ్డాయి. గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైనా, ఇప్పటికీ కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, నెల్లూరు జిల్లాల్లో వానలోటు ఉంది. మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 77.90 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయన్న వ్యవసాయశాఖ అంచనాలో ఇప్పటికి 69.37 లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. అయితే ఈ ఏడాది వరి, చిరుధాన్యాలు, అపరాల సాగు విస్తీర్ణం కొంత పెరిగింది.

# స్విమ్స్‌లో మెడికల్ మాఫియాకు బ్రేక్..!




(తిరుపతి,అక్టోబర్ 13(సందేశం టైమ్స్):స్విమ్స్‌లో మెడికల్ మాఫియాకు బ్రేక్ పడనుంది. లాభాపేక్ష లేకుండా సొంతంగానే మెడికల్ షాపు నిర్వహించేలా టీటీడీ నిర్ణయం తీసుకోనుంది. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఛైర్మన్ బీఆర్ నాయుడు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో పులివెందుల పెత్తనం స్విమ్స్‌లో చాపకింద నీరులా పాకింది. శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద నామమాత్రపు అద్దెతో షాపును దక్కించుకుని లక్షలాది రూపాయలు ఆర్జించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా సదరు షాపునకు టెండరు జరిగినప్పటికీ మాఫియా ఉచ్చులో నుంచి బయటకు రాలేకపోయింది. ఈ పరిణామాలపై పలుసార్లు కథనాలను ప్రచురించింది. ఈ క్రమంలో షాపును రద్దు చేసేందుకు టీటీడీ సిద్ధమైంది.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జనఔషధి మెడికల్ షాపుల పేరిట అప్పటి టీటీడీ ఛైర్మన్లు వారి అనుచరులకు చెరో మెడికల్ షాపులు నామమాత్రపు అద్దెకు కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. వాటిని రద్దుచేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. స్విమ్స్ ఓపీల వద్ద ఉండే షాపును రద్దుచేయగలిగారు గాని పద్మావతి ఆస్పత్రి వద్ద ఉన్న మెడికల్ షాపును మాత్రం కదిలించలేకపోయారు. టీటీడీ మూడుసార్లు టెండర్లు పిలిచింది. అసాధారణ నిబంధనలు పెట్టడం వలన టెండరులో పాల్గొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తిచూపలేదు. తాజాగా ఆగస్టులో నాలుగోసారి టెండరు పిలిచారు.

# పాపికొండల బోటు షికారు ప్రారంభం




రాజమహేంద్రవరం,అక్టోబర్ 13(సందేశం టైమ్స్): ప్రసిద్ధి చెందిన పాపికొండల బోటు షికారు మూడు నెలల విరామం తరువాత ప్రారంభమైంది. గోదావరి వరదల కారణంగా జూలైలో బోటు షికారుని ప్రభుత్వం నిలిపివేసింది. వరదలు తగ్గడంతో తిరిగి ఆరంభమయ్యాయి. పోలవరం ప్రాజెక్టు సమీపంలో గండిపోచమ్మ గుడి వద్ద నుంచి ఒక బోటు వెళ్లింది. 23 మంది ప్రయాణించారు. తూర్పుగోదావరి జిల్లా గండిపోచమ్మ గుడి వద్ద నుంచి సుమారుగా 15 బోట్లు అందుబాటులో ఉన్నాయి. మెల్లగా పర్యాటకుల సందడి పెరుగుతుందని ఆపరేటర్లు చెపుతున్నారు. గండిపోచమ్మ ఆలయం నుంచి ఉదయం 10 గంటలకు ఈ బోటు షికారు మొదలవుతుంది. పేరంటాలపల్లి వరకూ వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటలకు గండిపోచమ్మ గుడివద్దకు వస్తుంది. రెండు వైపులా పాపికొండల అందాలు, గోదావరి వంపు సొంపులు, ప్రవాహం, పచ్చని ప్రాంతాలు కనువిందు చేస్తుంటాయి. ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. రాజమండ్రి నుంచి వాహనాల్లో గండిపోచమ్మ గుడి వరకూ బోటు నిర్వాహకులు యాత్రికులను తీసుకెళతారు. పెద్దలకు రూ. 1,250, పిల్లలకు రూ. 1,000గా ధర నిర్ణయించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం తినుబండారాలు ఈ ప్యాకేజ్‌లో ఉన్నాయి. నేరుగా గండిపోచమ్మ గుడి వద్ద కూడా బోటు ఎక్కవచ్చు. ఇదిలా ఉండగా రాజమండ్రి అఖండ గోదావరిలో మూడు హౌస్‌బోట్ల షికార్‌కు ప్రభుత్వం అనుమతించింది. రాజమండ్రి పుష్కర ఘాట్‌లో ఒకటి, సరస్వతీ ఘాట్‌లో ఒకటి, కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఒకటి నడపనున్నారు.

# ఆక్రమణకు గురవుతున్న ఆవుల డొంక



బల్లికురవ, అక్టోబర్ 13(సందేశం టైమ్స్): మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో పురా తన కాలం నుండి రైతులకు ఎంతో ఉపయెగ పడే ఆవుల డొంకను కొందరు రైతులు పంటలు సాగు చేస్తూ ఆక్రమించుకుంటు న్నారు. దీంతో డొంకకు ఎగువ భాగంలో పంట భూములు ఉన్న రైతులు ఈ డొంకలో గుండా రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముక్తేశ్వరం గ్రామంలో కొండ దిగువన ఉన్న ఆవుల డొంకకు ఇరు వైపులా సుమారు వంద ఎకరాలకు పైబడి పంట భూమి ఉంది. ఈ డొంకను కొందరు రైతులు రెండు వైపులా రోజు రోజుకు నరుకు తున్నారు. పంట భూముల్లో వ్యర్థాలను సైతం రోడ్డునే పడేస్తున్నారు. దీంతో నిత్యం పంట పోలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఈడొంకను గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి పరిచారు. అయినప్పటికి డొంక భూమిని రైతులు అక్రమించుకుంటున్నారు. దిగువ భూములు ఉన్న రైతులకు ఇబ్బంది లేకపోయిన సుమారు 50 ఎకరాల పంటలు సాగు చేసే రైతులు మాత్రం ఆవుల డొంక సరిగా లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబందిత అధికారులు వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఆవుల డొంకను సర్వే చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# చెయ్యెత్తిన చోట ప్రయాణికులను ఎక్కించుకుంటాం



రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబర్ 13(సందేశం టైమ్స్): ప్రయాణికులు చేయి ఎత్తినచోట ఎక్కించుకుని, వారు కోరిన చోట దించవలసిందిగా ఆర్టీసీ సిబ్బంది అందరికీ ఆదేశాలు ఇచ్చామని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ స్పష్టం చేశారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా.. కుక్కునూరుకు చెందిన పలువురు ప్రయాణీకులు వయా కుక్కునూరు బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలు కావడంలేదని, పురుషులు ఎక్స్‌ప్రెస్ బస్సు ఛార్జీల కంటే ఎక్కువగా చెల్లించడం వల్ల ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారని ఫోన్ ద్వారా డీఎంకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ రాజమహేంద్రవరం–భద్రాచలం వయా కుక్కునూరు రూటులోని ఆల్ట్రా డీలక్స్ సర్వీసుల్లో స్త్రీ శక్తి– మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వర్తించదని, అంతర్రాష్ట్ర సర్వీసులకు ఇతర రాష్ట్రాల్లో 16 కిలోమీటర్ల లోపు ప్రయాణ పరిధి ఉంటేనే స్త్రీ శక్తి పథకం వర్తిస్తుందని తెలిపారు. గతంలో తిరిగిన రాజమహేంద్రవరం–పేకేరు నైట్‌హాల్టు బస్సును పునరుద్ధరించాలని కోరగా, సరైన ఆదాయం రాకపోవడంతో రద్దు చేశామని ప్రయాణికుల కోరిక మేరకు కొత్త బస్సులు వచ్చాక పునరుద్ధరించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలాగే, వేమగిరి గట్టు వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఉన్నా బస్సులు ఆపడంలేదని వినతి రాగా, సమస్యను పరిష్కరిస్తామన్నారు. బొబ్బిల్లంక స్టేజీ వద్ద స్టాప్ ఉన్నా బస్సులు ఆపడంలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎం స్పందిస్తూ ప్రయాణికులు చేయి ఎత్తినచోట ఎక్కించుకుని, వారు కోరిన చోట దించే విధంగా సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. రాజమహేంద్రవరం నుంచి వయా చక్రద్వారబంధం, తుంగపాడు, ద్వారపూడి, మండపేట మీదుగా రామచంద్రపురం బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అద్దె బస్సులు ద్వారపూడి గ్రామంలోకి రావాలని, బస్టాండులో బస్సుల టైమింగ్స్ డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని, పండుగల సమయంలో ద్వారపూడి నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడపాలని అందిన వినతిపై డీఎం స్పందిస్తూ కొత్త బస్సులు వచ్చాక తుంగపాడు మీదుగా బస్సును ఏర్పాటు చేస్తామన్నారు. అద్దె బస్సులు ద్వారపూడి గ్రామంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, టైమింగ్స్ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే ఎక్కువ మంది ప్రయాణికులు ఉంటే దూరప్రాంత బస్సు సర్వీసులను ఎక్కడి నుంచి ఎక్కడికైనా అన్ని వేళలా ఏర్పాటు చేస్తామని, దీనికోసం డిపో అధికారులను సంప్రదించాలని మాధవ పేర్కొన్నారు.

# సత్యవరంలో తాగు నీటి కష్టాలు



నరసన్నపేట, అక్టోబర్ 13(సందేశం టైమ్స్): నరసన్నపేట పంచాయతీ పరిధిలో గల సత్యవరం గ్రామంలో ఐదురోజులుగా తాగునీరు కోసం గ్రామస్థులు కష్టాలుపడాల్సివస్తోంది. గ్రామానికి తాగునీరు పంపిణీ చేసి రక్షిత మంచినీటి పథకం వద్ద నీటిని స్టోర్ చేసే వ్యవస్థ దెబ్బతింది. దీంతో గ్రామంలో ఐదురోజులగా తాగునీరు సరఫరాకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నరసన్నపేట పైడితల్లి జంక్షన్ వద్దకు మంచినీటి కుళాయిల వద్దకు వచ్చి తాగునీరు తీసుకువెళ్లాల్సివస్తోంది. గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను పంచాయతీ దృష్టికి కొందరు తీసుకెళ్లవడంతో ట్యాంకర్లతో తాగునీటి పంపిణీచేపట్టారు. కాగా రక్షిత పథకం వద్ద వాల్స్ దెబ్బతిన్నాయని, వీటిని విజయవాడ నుంచి తెప్పించి పూర్తిస్థాయిలో తాగునీరందిస్తామని ఈవో ద్రాక్షాయిణి తెలిపారు.

# తల్లీకూతూరు సాధించారిలా!




కాకినాడ/జీజీహెచ్, అక్టోబర్ 13(సందేశం టైమ్స్): తల్లి, తనయ ఇద్దరూ ఒకేసారి ఏపీ హైకోర్టు బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా పేర్లు నమోదు చేసుకున్న అరుదైన ఘటన కాకినాడలో జరిగింది. కాకినాడ రామారావుపేటకు చెం దిన మల్లిపూడి మెహెరానీ, ఆమె కుమార్తె లక్ష్మీ ఐశ్వర్య ఇద్దరూ న్యాయ విద్యనభ్యసించి.. న్యాయవాదులుగా హైకోర్టు బార్ కౌన్సిల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మెహరానీకి చిన్నప్పటి నుంచీ చదువంటే ప్రాణం. న్యాయవాదిగా మా రాలనేది ఆమె సంకల్పం. తొలుత బీఎస్సీ డిగ్రీ పూర్తి చేయాలనుకున్న ఆమెకు తల్లిదండ్రులు వివాహం చేయడంతో అది నెరవేరలేదు. వివా హం అనంతరం ఆమె భర్త జీవీవీ సత్యనారాయణ ప్రోత్సాహంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ పూర్తి చేసింది. అనంతరం రాజీవ్‌గాంధీ లా డిగ్రీ కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో చేరి.. తన కలను నెరవేర్చుకుంది. తనకు ఇష్టమైన న్యాయవాది డిగ్రీ పట్టా పొందింది. ఇక మరోవైపు తల్లి మెహెరానీ లాగే తనయ లక్ష్మీ ఐశ్వర్య కూ డా న్యాయవాద వృత్తినే ఎంచుకుంది. ఆమె ఒడిశాలోని నేషనల్ లా యూనివర్సిటీ నుంచి బీబీఏ ఎల్ ఎల్‌బీ (ఆనర్స్) పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో ఎల్ఎ ల్ఎం చదువుతోంది. దీంతో తల్లీకుమార్తెలు ఇద్దరూ ఒకే రోజున రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్‌లో సభ్యులుగా చేరారు. తన భర్త సత్యనారాయణ (ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెకర్), కుటుంబసభ్యుల సహకారంతో ఇది సాధ్యమైందని మెహరానీ చెప్పారు. వారిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు అభినందించారు.

# ఉరేసుకొని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



ఎల్కతుర్తి (వరంగల్) :అక్టోబర్ 13(సందేశం టైమ్స్): బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం %ా%. వరంగల్ రూరల్ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్ పూర్ గ్రామానికి చెందిన కృష్ణాకర్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె జె.కీర్తన (19) ఈ ఏడాది ఇంజినీరింగ్‌లో జాయిన్ అయింది. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. అయితే కాలేజీలో జాయిన్ అయినప్పటి నుంచి అధ్యాపకులు చెప్పిన పాఠాలు అర్థం కావటం లేదని, తల్లిదండ్రులకు దూరంగా ఉండలేకపోతున్నానని తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి బాధపడుతుండేది. దీంతో ఆమెను ఇంటికి రప్పించిన తల్లిదండ్రులు ఆమెను సమీపంలోని కళాశాలలో చేర్పించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. తల్లిదండ్రులు ఆ ప్రయత్నంలో ఉండగానే ఈ నెల 10న శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కీర్తన ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొంత సమయానికి ఇంటికి వచ్చిన తండ్రి కృష్ణాకర్ గమనించి వెంటనే కిందకు దించి గ్రామంలోని ఆర్ఎంపీని పిలిపించి పరీక్షించారు. కానీ కీర్తన అప్పటికే మృతి చెందింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

# నెల్లూరు హెూటల్లో భారీ అగ్ని ప్రమాదం..


నెల్లూరు:అక్టోబర్ 13(సందేశం టైమ్స్): నగరంలోని బ్లూ మూన్ హెూటల్లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే హెూటల్ యాజమాన్యం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. అనంతరం హెూటల్లో చిక్కుకున్న 30 మందిని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా కాపాడారు.సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని ఎస్పీ అజిత వెజెండ్ల పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం.. ఎవరికి గాయాలు కాలేవని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏస్పీ వెల్లడించారు.

# చీరాల బీచ్‌లో విషాదం.. సముద్ర స్నానం చేస్తూ ఐదుగురు గల్లంతు..




బాపట్ల జిల్లా:అక్టోబర్ 13(సందేశం టైమ్స్): చీరాల మండలం వాడరేవులో విషాదం చోటు చేసుకుంది. ఐదుగురు విద్యార్థులు సముద్ర స్నానం కోసం వాడరేవు బీచ్‌కు వెళ్లి గల్లంతయ్యారు. నీటిలో మునిగి సముద్రంలోకి కొట్టుకుపోయారు. కొద్దిసేపటికి ముగ్గురు విద్యార్థుల మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మరో ఇద్దరు విద్యార్థుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. సెలవు రోజులు కావడంతో బీచ్‌లో సరదాగా గడిపేందుకు అమరావతిలోని విట్ యూనివర్సిటికి చెందిన కొందరు విద్యార్థులు వాడరేవు బీచ్‌కు వెళ్లారు. వారిలో సాకేత్, మణిదీప్, సాత్విక్, సోమేష్, గౌతమ్ అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన మత్స్యకారులు, గజ ఈతగాళ్ళు వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.గల్లంతైన కాసేపటికి సాకేత్, మణిదీప్, సాత్విక్‌ల మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. సోమేష్, గౌతమ్‌ల ఆచూకీ ఇప్పటివరకూ లభ్యం కాలేదు. దీంతో ఈ ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# పెచ్చులూడి.. బీటలు వారి



కొత్తూరు, అక్టోబర్ 13(సందేశం టైమ్స్):కొత్తూరు సీహెచ్‌సీ ఆవరణలో గల ఆయుర్వేద ఆసుపత్రిశిథిలావస్థకు చేరడంతో ఇక్కడకు వచ్చేరోగులు భయాందోళన చెందుతున్నారు. రెండు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనం కనీస మరమ్మ తులకు నోచుకోవడంలేదు. దీంతో ప్రస్తుతం శ్లాబ్ నుంచి పెచ్చులూడుతున్నాయి. గోడలు బీటలు వారడంతో ఏ క్షణం కూలిపోతుందోనని భయాందోళనతో రోగులు ఇక్కడకు వచ్చేందుకు ఆసక్తిచూపడం లేదు.దీనికితోడు ఆసుపత్రి ఆవరణ అధ్వా నంగా ఉండడంతో రోగులు ఇబ్బందిపడుతున్నారు. ఈ భవనంలో పక్కనఉన్న ఐటీసీకేంద్రం భవనం దుస్థితి కూడా అధ్వానంగా ఉండడంతో రోగులు ఈ రెండు కేంద్రాలకు వేళ్లేందుకు ఆశక్తి చూపడం లేదు. ఉన్నతాదికారులు స్పందించి ఇతర గదుల్లోకి ఆయుర్వేద ఆసుత్రి మార్చాలలని రోగులు కోరుతున్నారు.

# ఎల్‌బీనగర్‌లో కారు బీభత్సం..

## ఐదుగురికి తీవ్ర గాయాలు




హైదరాబాద్ :అక్టోబర్ 13(సందేశం టైమ్స్): హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అర్ధరాత్రి ఓ థార్ కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ అతివేగంతో కారును నడిపి వరుస ప్రమాదాలకు కారణమయ్యాడు. ఈ ఘటనలో మొత్తం ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బీఎన్‌రెడ్డినగర్ సమీపంలోని గుర్రంగూడ వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఇంజాపూర్ నుంచి గుర్రంగూడ వైపు వేగంగా దూసుకొచ్చిన థార్ కారు అదుపు తప్పింది. తొలుత రోడ్డుపై వెళ్తున్న ఓ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. డివైడర్‌ను దాటుకుని ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఆ తర్వాత వాహనం గాల్లోకి లేచి మూడు పల్టీలు కొట్టి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. థార్ వాహనంలో ఉన్న డ్రైవర్‌తో పాటు యజమాని అనిరుధ్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే, రెండో కారులో ప్రయాణిస్తున్న దినేష్, శివ అనే ఇద్దరు వ్యక్తులు కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను హస్తినాపురంలోని రెండు వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. ప్రస్తుతం వారంతా చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణలో అగ్నిప్రమాదాలు.. భారీగా ఆస్తి నష్టం




హైదరాబాద్, నల్లగొండ, అక్టోబర్ 13(సందేశం టైమ్స్): తెలంగాణ వరుస అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్‌లోని మణికొండ మిర్యాలగూడ పట్టణం హనుమాన్ పేటలో జరిగిన ప్రమాదాల్లో భారీగా ఆస్తినష్టం సంభవించింది. ఘటనా విషయం తెలియడంతో మంటలను ఆర్పడానికి అగ్నిమాపక అధికారులు ప్రయత్నిస్తున్నారు. మణికొండలో అగ్నిప్రమాదం జరిగింది. బీఆర్సీ అపార్ట్‌మెంట్ ఎలక్ట్రికల్ వైర్స్ డక్ యూనిట్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటలను చూసి కిందకు పరుగులు తీశారు అపార్ట్‌మెంట్ వాసులు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు అగ్ని మాపక సిబ్బంది. నాలుగు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఎలక్ట్రికల్ డక్ యూనిట్‌లో వైర్లు పూర్తిగా కాలిపోవడంతో 19 ఫోర్ల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంటలను చూసి కిందకు పరుగులు తీసే క్రమంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మిర్యాలగూడలో...మిర్యాలగూడ పట్టణం హనుమాన్ పేటలో మరో భారీ అగ్నిప్రమాదంజరిగింది. శ్రీ లక్ష్మీ పవన్ ఎలక్ట్రికల్స్, విజయలక్ష్మి ఆటోమోటివ్స్ గోడౌన్‌లో మంటలు ఎగిసిపడుతున్నాయి. ఈ ఘటనలో ఎలక్ట్రికల్, ఆటోమోటివ్స్ పరికరాలు అగ్నికి కాలి బూడిదయ్యాయి. మంటల ధాటికి చుట్టూ పక్కల ప్రాంతాలకు పొగ అలుముకుంది. పొగతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో వెంటనే స్థానికులు అగ్నిమాపక అధికారులు, పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.30లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. ఈ ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# జువైనల్ హోంలో లైంగిక దాడిపై పోలీసులు ఏం తేల్చారంటే




%హైదరాబాద్, అక్టోబర్ 13(సందేశం టైమ్స్):: సైదాబాద్ అబ్జర్వేషన్ హోంలో లైంగిక దాడి నిజమే అని పోలీసులు నిర్ధారించారు. మైనర్ బాలుడిపై లైంగిక దాడి జరిగినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. మైనర్ బాలుడిపై స్టాఫ్ గార్డ్ రహమాన్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. హోంలో మరో ఐదుగురిపై కూడా లైంగిక దాడి జరిగినట్టు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో ఐదుగురు బాలురను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వారికి వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే బాధిత బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం స్టాఫ్ గార్డ్ రెహమాన్ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. అంతేకాకుండా... ఎంతకాలంగా అబ్జర్వేషన్ హోంలో మైనర్ బాలురపై లైంగిక దాడికి పాల్పడుతున్నాడన్న కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జువైనల్ హోంలో లైంగిక దాడి ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ సీరియస్ అయ్యింది.

# రక్తశుద్ధికి వెళితే కొత్త రోగాలు



**డెత్‌బెడ్స్‌గా డయాలసిస్ కేంద్రాలు?**
**గత నెలలో మణుగూరులో ఓ రోగికి హెచ్‌ఐవీ**
**హాట్ డిస్ ఇన్ఫెక్షన్ చేయని రక్తశుద్ధి కేంద్రాలు**
**3 నెలలకోసారి జరగని వైరల్ మార్క్ టెస్టులు**
**కొన్ని చోట్ల రెండుసార్లు డయలైజర్ల వాడకం**
**షిఫ్టుల కోసం రోగుల నుంచి డబ్బులు వసూలు**
**పర్యవేక్షణ కొరవడినందునే ఈ పరిస్థితి!**

హైదరాబాద్, అక్టోబర్ 13(సందేశం టైమ్స్):మూత్రపిండాల వ్యాధి బారిన పడి.. డయాలసిస్ కోసం ప్రభుత్వ రక్తశుద్ధి కేంద్రాలకు వెళు_న్న రోగులు కొత్త రోగాల బారిన పడుతున్నారు. రక్తశుద్ధి కోసం వెళితే డెత్‌బెడ్ ఎక్కాల్సిన పరిస్థితి ఎదురవుతోందని వారు ఆందోళన చెందుతున్నారు. సర్కారీ డయాలసిస్ కేంద్రాల్లో సరైన హాట్ డిస్‌ఇన్ఫెక్షన్ చేయడం లేదని, దాంతో కిడ్నీ రోగులు హెచ్‌ఐవీ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని అంటున్నారు. గత నెలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని డయాలసిస్ కేంద్రానికి రక్తశుద్ధి కోసం వెళ్లిన ఓ 60 ఏళ్ల వ్యక్తికి రక్తపరీక్షల్లో హెచ్‌ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దాంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. గతంలో కూడా డయాలసిస్ కారణంగా ఇతర జబ్బుల బారిన పడిన బాధితులు ఉన్నట్లు వైద్య వర్గాలు పేర్కొన్నాయి. రక్తశుద్ధి కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ నుంచి సరైన పర్యవేక్షణ ఉండటం లేదని, అందుకే నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను 2014-15లో ప్రారంభించారు. నాడు 5,476 మంది కిడ్నీ ఫెయిల్యూర్ బాధితులకు రక్తశుద్ధి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 102 డయాలసిస్ కేంద్రాలున్నాయి. వాటిలో 14,156 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీటన్నింటినీ హబ్ అండ్ స్పోక్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రులు నోడల్ సెంటర్లుగా, డయాలసిస్ కేంద్రాలు స్పోక్ పద్ధతిలో పని చేస్తున్నాయి. గతేడాది డయాలసిస్ కేంద్రాల్లో నెలకు సగటున 93,015 సైకిల్స్ డయాలసిస్ చేశారు. 2014-2025 మధ్య కాలంలో మొత్తం 76లక్షల 25 వేల డయాలసిస్ సెషన్స్ జరిగాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ. 1090 కోట్లు ఖర్చు పెట్టింది. ప్రస్తుతం మూడు ప్రైవేటు కంపెనీలు డయాలసిస్ నిర్వహణను పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో చేస్తున్నాయి. సింగిల్ డయలైజర్ వాడకం పద్ధతిలో ఒక్కో డయాలసిసకు సర్కారు రూ. 1950 చొప్పున నిర్వహణ కంపెనీలకు చెల్లిస్తోంది. డయాలసిస్ కేంద్రాల్లో కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకున్న తర్వాత తదుపరి రోగికి రక్తశుద్ధి చేయాలంటే కొంత విరామం ఇవ్వాలి. డయాలసిస్ చేసిన వెంటనే కనీసం అరగంటపాటు హాట్ డిస్‌ఇన్ఫెక్షన్ చేయాలి. అంటే ఒక రోగికి వాడిన బ్లడ్ ట్యూబ్‌లతోపాటు డయాలసిస్ మెషిన్లను శుభ్రం చేయాలి. డయాలసిస్ కేంద్రాల్లో 5-10 మెషిన్లు ఉంటున్నాయి. కొన్ని కేంద్రాల్లో విపరీతమైన రద్దీ ఉంటుండడంతో డీప్ క్లీనింగ్ చేసేంత సమయం ఉండటం లేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. కొన్ని కేంద్రాల్లో అసలు హాట్ డిస్‌ఇన్ఫెక్షనే జరగడం లేదన్న ఆరోపణలున్నాయి. డిస్‌ఇన్ఫెక్షన్ చేస్తే తరువాత వచ్చే రోగికి ఎటువంటి ఇబ్బంది ఉండదని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. మన వద్ద హాట్ డిస్‌ఇన్ఫెక్షన్ ఎవరు చేస్తున్నారో పర్యవేక్షించే యంత్రాంగం లేదు. దీంతో కొన్నిసార్లు రోగులు ఇతర రోగాల బారిన పడుతున్నారు. అలాగే డయాలసిస్ రోగులకు ప్రతి మూడు నెలలకోసారి వైరల్ టెస్టులు విధిగా చేయాలి. ఈ వైరల్ మార్క్ టెస్టుల్లో హెచ్‌ఐవీ, హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్ఏజీ పరీక్షలుంటాయి. ఈ టెస్టులు కూడా ఎలీసా మెథడ్‌లో చేయాలి. కానీ, చాలా డయాలసిస్ కేంద్రాల్లో స్ట్రిప్ పద్ధతిలో చేస్తున్నారని, దీంతో రక్తపరీక్షల్లో సరైన కచ్చితత్వం ఉండటం లేదని రోగులు చెబుతున్నారు. అలాగే బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేసుకోవాలని, అది కూడా సరిగా చేయడం లేదన్న విమర్శలున్నాయి.

# తెలంగాణలో హ్యామ్ రోడ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్.. నిధులు విడుదల




హైదరాబాద్, అక్టోబర్ 13(సందేశం టైమ్స్):తెలంగాణలో హ్యామ్ రోడ్లకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో రూ. 25,661 కోట్లతో రహదారి నిర్మాణాలకు ఆమోదం తెలిపింది. జాతీయ రహదారుల జాబితాలో తెలంగాణ నుంచి ఐదు హైవేలకు చోటు దక్కింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 431 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి అనుమతి లభించింది. హ్యామ్ విధానంలో కేంద్రం-ఎన్‌హెచ్ఏఐ నిధుల్లో 40:60 నిష్పత్తితో రోడ్ల నిర్మాణం జరుగనుంది. ఆర్మూర్-జగిత్యాల రహదారి నాలుగు లేన్లుగా విస్తరిస్తూ అభివృద్ధి చేయనున్నారు.

ఇక జగిత్యాల-మంచిర్యాల హైవే విస్తరణకు రూ. 2,550 కోట్ల మంజూరు అయింది. జగిత్యాల-కరీంనగర్ రహదారికి రూ. 2,384 కోట్లు కేటాయించారు. అర్మూర్-జగిత్యాల రహదారి నిర్మాణానికి రూ. 2,338 కోట్లు ఆమోదం లభించింది. హైదరాబాద్ ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టుకు రూ. 15,627 కోట్ల నిధుల కేటాయించారు. మహబూబ్‌నగర్-రాయచూర్ రహదారి ఫోర్ లేన్‌గా విస్తరణకు రూ. 2,662 కోట్లు మంజూరు చేశారు. కేంద్ర ప్రభుత్వ అనుమతితో రాష్ట్ర రహదారుల అభివృద్ధికి కొత్త రోడ్డు మ్యాప్ ఏర్పాటు చేయనున్నారు.

# బైకును ఢీకొన్న ఇసుక లారీ




పంజాగుట్ట, అక్టోబర్ 13(సందేశం టైమ్స్): హైదరాబాద్‌లోని బేగంపేట గ్రిన్‌ల్యాండ్స్ చౌరస్తా సమీపంలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ద్విచక్ర వాహనాన్ని ఇసుక లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వైద్యుడితో పాటు ర్యాపిడో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఖమ్మం జిల్లా హవేలి రూరల్ మండలానికి చెందిన ఎం.నవీన్ (30) జేఎన్‌టీయూ సమీపంలో నివాసం ఉంటూ ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బేగంపేట్ కుందన్‌బాగ్‌లో నివాసం ఉంటూ బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో జనరల్ ఫిజిషియన్‌గా పనిచేస్తున్న జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన డాక్టర్ కస్తూరి జగదీశ్ చంద్ర (35) ఆదివారం తెల్లవారుజామున ర్యాపిడో బైక్ బుక్ చేసుకోగా నవీన్ తన హొండా యాక్టివా ద్విచక్ర వాహనంపై అతడిని ఎక్కించుకుని బయలుదేరాడు. మార్గమధ్యలో గ్రిన్‌ల్యాండ్ చౌరస్తా వద్ద యూసుఫగూడ వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ (టీఎన్ 09యూడి9279) వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ర్యాపిడో డ్రైవర్ నవీన్ లారీ వెనుక చక్రాల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న డాక్టర్ జగదీశ్ డివైడర్‌పై పడి మృతి చెందారు. డాక్టర్ జగదీశ్‌ను స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వి.శంకర్ (38)ను అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.




# క్రీడావార్తలు




# ఫాలో ఆన్‌లో కరీబియన్ల అనూహ్య పోరాటం

## కులదీపునకు ఐదు వికెట్లు
## విండీస్ 173/2
## తొలి ఇన్నింగ్స్‌లో 248 ఆలౌట్
## భారత్‌తో రెండో టెస్ట్

న్యూఢిల్లీ: ఊదేస్తామనుకొన్న భారత్‌కు.. ఫాలో ఆన్ ఆడుతున్న వెస్టిండీస్ కౌంటర్ అటాక్‌తో ఎదురు నిలిచింది. జాన్ క్యాంప్‌బెల్ (87 బ్యాటింగ్), షాయ్ హోప్ (66 బ్యాటింగ్) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో.. విండీస్ ఆటను నాలుగో రోజుకు తీసుకెళ్లింది. 97 పరుగుల వెనుకంజలో ఉన్న కరీబియన్లు టీమిండియా ఇన్నింగ్స్ విజయాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారు. 270 పరుగుల లోటుతో ఫాలో ఆన్‌లో పడిన విండీస్.. ఆదివారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 173/2 స్కోరు చేసింది. చేతిలో ఇంకా 8 వికెట్లు ఉండడంతో.. భారత్‌కు లక్ష్యాన్ని నిర్దేశించే దిశగా సాగుతోంది. ఓపెనర్ తేజ్‌నరైన్ చందర్‌పాల్ (10)ను సిరాజ్ పెవిలియన్ చేర్చగా.. అలిక్ అథనజె (7)ను సుందర్ బౌల్డ్ చేశాడు. అయితే, మరో ఓపెనర్ క్యాంప్‌బెల్, హోప్ మూడో వికెట్‌కు 138 పరుగుల అజేయ భాగస్వామ్యంతో ఎదురుదాడి చేశారు. ఈ క్రమంలో విండీస్ తరఫున ఈ ఏడాది అత్యధిక భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 140/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్ 248 పరుగులకు కుప్పకూలింది. షాయ్ హోప్ (36), అండర్సన్ ఫిలిప్స్ (24 నాటౌట్), కేరీ పియర్రీ (23) కొంతసేపు క్రీజులో నిలిచారు. కుల్దీప్ ఐదు, జడేజా మూడు వికెట్లు పడగొట్టారు. అయితే, టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగకుండా వెస్టిండీసను ఫాలో ఆన్ ఆడించింది. తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 518/5 వద్ద డిక్లేర్ చేసింది.

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) సుదర్శన్ (బి) జడేజా 10, చందర్‌పాల్ (సి) రాహుల్ (బి) జడేజా 34, అథనజె (సి) జడేజా (బి) కుల్దీప్ 41, హోప్ (బి) కుల్దీప్ 36, చేజ్ (సి అండ్ బి) జడేజా 0, టెవిన్ ఇమ్లాచ్ (ఎల్బీ) కుల్దీప్ 21, గ్రీవ్స్ (ఎల్బీ) కుల్దీప్ 17, కరీ పైర్రీ 23, వారికన్ (బి) సిరాజ్ 1, ఫిలిప్స్ (నాటౌట్) 24, జేడెన్ సీల్స్ (ఎల్బీ) కుల్దీప్ 13బీ ఎక్స్‌ట్రాలు: 28బీ మొత్తం: 81.5 ఓవర్లలో 248 ఆలౌట్‌బీ వికెట్ల పతనం: 1-21, 2-87, 3-106, 4-107, 5-156, 6-163, 7-174, 8-175, 9-221, 10-248బీ బౌలింగ్: బుమ్రా 14-4-40-1, సిరాజ్ 9-2-16-1, జడేజా 19-5-46-3, కుల్దీప్ యాదవ్ 26.5-4-82-5, సుందర్ 13-2-41-0.వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (బ్యాటింగ్) 87, చందర్‌పాల్ (సి) గిల్ (బి) సిరాజ్ 10, అథనజె (బి) సుందర్ 7, హోప్ (బ్యాటింగ్) 66బీ ఎక్స్‌ట్రాలు: 3బీ మొత్తం: 49 ఓవర్లలో 173/2బీ వికెట్ల పతనం: 1-17, 2-35బీ బౌలింగ్: సిరాజ్ 6-2-10-1, జడేజా 14-3-52-0, సుందర్ 13-3-44-1, కుల్దీప్ 11-0-53-0, బుమ్రా 4-2-9-0, జైస్వాల్ 1-0-3-0.


చేజ్-హోల్డర్ తర్వాత భారత్‌తో టెస్ట్‌లో ఒక పూర్తి సెషన్ బ్యాటింగ్ చేసిన జంటగా క్యాంప్‌బెల్-హోప్. 2016లో కింగ్‌స్టన్‌లో జరిగిన టెస్ట్‌లో ఐదో రోజు ఆఖరి సెషన్‌లో 19 ఓవర్లపాటు క్రీజులో నిలిచిన ఛేజ్-హోల్డర్ విండీసను డ్రాతో గట్టెక్కించారు.భారత పర్యటనలో గత మూడు ద్వైపాక్షిక సిరీసల్లో.. ఆడిన ఆరు టెస్ట్‌ల్లో ఒక మ్యాచ్‌ను వెస్టిండీస్ నాలుగో రోజుకు తీసుకెళ్లడం ఇదే తొలిసారి.ఎటువంటి మ్యాచ్ ఒత్తిడీ లేకపోవడంతో ఫీల్డింగ్ చేస్తున్న భారత ఆటాగాళ్లు ఎంతో సరదాగా కనిపించారు. జడేజా జోకులు పేలుస్తుంటే.. కుల్దీప్ వికెట్ పడగొట్టినప్పడల్లా జైస్వాల్.. గిల్‌తో సంబరాలు చేసుకొన్నాడు. స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేస్తున్న రాహుల్.. జేబులోంచి లిప్‌బామ్ తీసుకొని రాసుకొన్నాడు. కొంచెం ఆవలగా నిలబడిన గిల్.. రాహుల్ వద్దకు వచ్చి ఏదో అనడంతో రాహుల్ కూడా సరదాగా తిరిగి కౌంటర్ ఇచ్చాడు. ఆ తర్వాత ఇద్దరూ నవ్వుకున్నారు. ఈ సీన్ అభిమానుల దృష్టిలో పడడంతో.. నెట్‌లో వైరల్ అయింది.క్రమశిక్షణను ఉల్లంఘించిన విండీస్ పేసర్ సీల్స్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోతతోపాటు ఓ డిమెరిట్ పాయింట్‌ను అతడి ఖాతాలో చేర్చారు. భారత తొలి ఇన్నింగ్స్ 29వ ఓవర్‌లో తన బౌలింగ్‌లోనే బంతిని ఆపిన సీల్స్.. బ్యాటర్ జైస్వాల్‌వైపు విసిరేశాడు. అయితే, బంతి జైస్వాల్ ప్యాడ్‌లకు బలంగా తాకింది. దీంతో ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో ఆర్టికల్ 2.9 కింద అతడిపై మ్యాచ్ రెఫరీ చర్యలు తీసుకొన్నాడు.




# 330 చాల్లేదు ఆస్ట్రేలియా రికార్డు ఛేదన

క్రికెటర్ల బాదుడుకు విశాఖ స్టేడియంలో పరుగుల వరదే పారింది. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్ ధాటికి మిడిలార్డర్ తోడవ్వడంతో భారత్ ఏకంగా 330 పరుగులతో వహ్వా.. అనిపించింది. ఇక గెలుపు మనదే అని ఫ్యాన్స్ సంబరపడిన వేళ ప్రత్యర్థి ఆసీస్ మాత్రం ఎప్పటిలాగే తమ ప్రొఫెషనల్ ఆటతీరును చూపింది. లక్ష్యం ఎంత భారీదైనా తమ దూకుడు ముందు దిగదుడుపే అని నిరూపించింది. కెప్టెన్ అలీసా హీలీ ఆరంభం నుంచే కదం తొక్కుతూ అద్భుత శతకంతో ఛేదనకు మార్గం సుగమం చేసిన వేళ.. భారత బౌలర్ల పోరాటం చిన్నబోయింది.

మహిళల వన్డే వరల్డ్‌కపలో భారత్‌కు మరో ఝలక్. ఆదివారం డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో ఓడింది. అటు 331 పరుగుల రికార్డు ఛేదనను ఆస్ట్రేలియా తమ చాంపియన్ ఆటతీరుతో మరో 6 బంతులుండగానే ముగించడం విశేషం. కెప్టెన్ అలీసా హీలీ (107 బంతుల్లో 21 ఫోర్లు, 3 సిక్సర్లతో 142) విధ్వంసకర శతకంతో చెలరేగింది. ఇది భారత్‌కు వరుసగా రెండో ఓటమి కాగా.. ఆసీసకు నాలుగు మ్యాచ్‌ల్లో మూడో విజయం. ఓ మ్యాచ్ రద్దయ్యింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముం దుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 48.5 ఓవర్లలో 330 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన (66 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80), ప్రతీకా రావల్ (96 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్‌తో 75) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. హర్లీన్ (38), జెమీమా (33), రిచా (32) రాణించారు. పేసర్ సదర్లాండ్‌కు ఐదు, సోఫీకి మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 49 ఓవర్లలో 331/7 స్కోరుతో గెలిచింది. పెర్రీ (47 నాటౌట్), గార్డ్‌నర్ (45), లిచ్‌ఫీల్డ్ (40) గెలుపులో భాగమయ్యారు. శ్రీచరణికి మూడు.. దీప్తి, అమన్‌జోత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హీలీ నిలిచింది.మెరుపు ఛేదన: భారీ లక్ష్యం కళ్లముందున్నా ఆసీస్ ఎలాంటి బెరుకు లేకుండా ఇన్నింగ్స్ ఆరంభించింది. ఎనిమిదో ఓవర్‌లో హీలీ 6,4,4,4తో 19 రన్స్ రాబట్టింది. ఇక పదో ఓవర్‌లో లిచ్‌ఫీల్డ్ నాలుగు ఫోర్లతో




రాణించి 17 రన్స్ సమకూర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 82 పరుగులతో నిలిచింది. అయితే శ్రీచరణి తన తొలి ఓవర్‌లోనే లిచ్‌ఫీల్డ్‌ను దెబ్బతీయడంతో మొదటి వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు హీలీ బాదుడుకు 15 ఓవర్లలోనే జట్టు స్కోరు వందకి చేరింది. ఆ తర్వాత ఎలిస్ పెర్రీ 32 పరుగుల దగ్గర కండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. ఈ సమయంలో బౌలర్లు పరుగులను కట్టడి చేయడంతో పాటు మూనీ (4), సదర్లాండ్ (0)లను వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చారు. 31వ ఓవర్‌లో 4,4,6తో చెలరేగి 84 బంతుల్లోనే హీలీ కెరీర్‌లో ఆరో శతకాన్ని పూర్తి చేసింది. ఇక అత్యంత ప్రమాదకరంగా మారిన హీలీ జోరుకు స్నేహ్ రాణా అద్భుత క్యాచ్‌తో శ్రీచరణి బ్రేక్ వేసింది. ఇక 36 బంతుల్లో 32 పరుగులు కావాల్సి ఉండగా ఆసీస్ చేతిలో నాలుగు వికెట్లున్నాయి. ఈ స్థితిలో పెర్రీ తిరిగి మైదానంలో అడుగుపెట్టింది. కిమ్ గార్త్ (14 నాటౌట్)ను అండగా చేసుకుని ఒత్తిడి తగ్గించే ప్రయత్నం చేసింది. ఇక 12 బంతుల్లో 13 రన్స్ కావాల్సి వేళ 49వ ఓవర్‌లో గార్త్ ఫోర్.. చివరి బంతికి పెర్రీ సిక్సర్‌తో ఆసీసకు అద్భుత విజయాన్నందించారు.ఆరంభు అదిరినా.. చివర్లో తడబాటు: ఈ మెగా టోర్నీలో ఇప్పటిదాకా తన స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయిన స్మృతి మంధాన ఫామ్‌ను అందుకుని తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగింది. మరో ఓపెనర్ ప్రతీకా రావల్‌తో పాటు మిడిలార్డర్ కూడా తలో చేయి వేయడంతో భారత్ పరుగుల వరద పారించింది. కానీ ఆసీస్ బౌలర్ల ధాటికి కేవలం 36 పరుగుల తేడాతో చివరి ఆరు వికెట్లు కోల్పోవడంతో ఆశించిన స్కోరు చేయలేకపోయింది.

# దీప్తికి స్వర్ణం

వర్టైన్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిపలో వరంగల్ అమ్మాయి జీవాంజి దీప్తి పసిడి పతకం దక్కించుకుంది. ఆదివారం ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరిగిన 400 మీటర్ల టీ20 కేటగిరీ పరుగులో దీప్తి 55.92 సెకన్లలో రేసును పూర్తి చేసి, అగ్రస్థానాన్ని దక్కించుకుంది. కరీనా పైమ్ (పోర్చుగల్) రజతం, టెలయ బ్లాక్‌స్మిత్ (ఆస్ట్రేలియా) కాంస్యం సాధించారు. ఇటీవల జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిపలో దీప్తి రజతం గెలవడం తెలిసిందే.




# కుర్రాళ్ల జోరు న్యూజిలాండ్‌పై భారత్ గెలుపు



జొహెూర్ బహ్రూ (మలేసియా): సుల్తాన్ జొహెూర్ కప్ జూనియర్ హాకీ టోర్నీలో భారత జట్టు జోరు కొనసాగిస్తోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 4-2తో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. అర్ష్‌దీప్ (2ని.), సునీల్ (15ని.), అరిజీత్ సింగ్ హుండాల్ (26ని.), రోషన్ (47ని.) భారత్‌కు గోల్స్ అందించారు. గస్ నెల్సన్ (41ని.), ఐడన్ మ్యాక్స్ (52ని.) న్యూజిలాండ్ తరఫున గోల్స్ చేశారు. టోర్నమెంట్‌లో భారత్‌కిది రెండో విజయం. శనివారంనాటి ఆరంభ మ్యాచ్‌లో గ్రేట్ బ్రిటన్‌పై 3-2తో నెగ్గిన సంగతి తెలిసిందే. మంగళవారం జరిగే తదుపరి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడుతుంది.

# అన్‌సీడెడ్‌గా వచ్చాడు ట్రోఫీ పట్టేశాడు



షాంఘై (చైనా): టోర్నీ ఆరంభానికి ముందు అతనో అనామక ఆటగాడు.. పైగా, ఏటీపీ ర్యాంకింగ్స్‌లో అతని స్థానం 204.. ఇంకేం, తొలి మ్యాచ్ నెగ్గడమే గగనం అనుకున్నారంతా! కానీ, అందరి అనుమానాలను పటాపంచలు చేస్తూ దిగ్గజం జొకోవిచ్‌లాంటి స్టార్లను చిత్తుచేస్తూ ముందుకు సాగిన అతను.. ఏకంగా టోర్నీ చాంపియన్‌గా నిలిచి అదరహో అనిపించాడు. అతనే, మొనాకోకు చెందిన 26 ఏళ్ల వాలెంటిన్ వాచెరోట్. ఏమాత్రం అంచనాలు లేని వాలెంటిన్.. షాంఘై మాస్టర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సింగిల్స్ ట్రోఫీ నెగ్గి సరికొత్త రికార్డు నమోదు చేశాడు. క్వార్టర్స్‌లో పదోసీడ్ హోల్గర్ రూన్‌కు, సెమీసలో నాలుగో సీడ్ జొకోవిచ్‌కు షాకిచ్చిన వాలెంటిన్ ఫైనల్లో తనకు వరుసకు సోదరుడైన ఆర్థర్ రిండెర్‌నెచ్‌ను 4-6, 6-3, 6-3తో ఓడించి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీ చరిత్రలో టైటిల్ నెగ్గిన అతి తక్కువ ర్యాంకర్‌గా వాలెంటిన్ నయా చరిత్ర సృష్టించాడు.

అమెరికా టెన్నిస్ స్టార్ కోకో గాఫ్.. వుహాన్ ఓపెన్‌లో విజేతగా నిలిచింది. చైనాలోని వుహాన్‌లో శనివారం జరిగిన మహిళల తుదిపోరులో మూడో సీడ్ గాఫ్ 6-4, 7-5తో తన దేశానికే చెందిన జెస్సికా పెగులపై గెలిచి ట్రోఫీ అందుకుంది. 21 ఏళ్ల గాఫ్‌కిది ఈ ఏడాది రెండో టైటిల్. అంతకుముందు ఫ్రెంచ్ ఓపెన్ గెలిచింది.

# బిజినెస్



## చైనాపై సుంకాలు.. నష్టాల్లో దేశీ సూచీలు

ఇంటర్నెట్ డెస్క్: ఊహించినట్టుగా సోమవారం దేశీయ మార్కెట్ సూచీలు నష్టాలతో ప్రారంభమయ్యాయి. చమురు, సహజ వాయువు రంగాల షేర్ల నష్టాలు, అమెరికా, చైనా వాణిజ్య ప్రతిష్ఠంభన, సుంకాల భయాలు సూచీలపై ప్రతికూల ప్రభావం చూపించాయి. మార్కెట్ ప్రారంభమైన కాసేపటికి సెన్సెక్స్ 418 పాయింట్లు నష్టపోయి 82,000 వద్ద, నిఫ్టీ 125 పాయింట్లు కోల్పోయి 25,200 వద్ద ట్రేడ్ అయ్యింది. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 88.76గా ఉంది%ఆసియా మార్కెట్లు కూడా నష్టాలను చవి చూస్తున్నాయి. హాంకాంగ్ ప్రామాణిక హాంగ్ సెంగ్ సూచీ 3.49 శాతం మేర క్షీణించి 916.89 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. చైనా, అమెరికా వాణిజ్య ఉద్రిక్తతలు బంగారం ధరలకు రెక్కలొచ్చేలా చేశాయి. సోమవారం ఔన్స్ బంగారం స్పాట్ ధర 4,044 డాలర్లకు పెరిగింది. ఇక గోల్డ్ ఫ్యూచర్స్ ధరలు కూడా 4,062 డాలర్ల వద్దు ఉన్నాయి.ఇక సెన్సెక్స్‌లో అల్ట్రాటెక్ సిమెంట్స్, టాటా స్టీల్, నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఏషియన్ పెయింట్స్,




భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్ లాభాలు బాటలో ఉన్నాయి. అమెరికా మార్కెట్ నుంచి జనరిక్ ఔషధాలకు డిమాండ్ యథాతథంగా కొనసాగుతుండటంతో ఫార్మా షేర్లకు కలిసొచ్చే అంశం.

## బంగారం ధరల్లో తగ్గుదల..
## నేటి రేట్స్ ఎలా ఉన్నాయంటే..




ఇంటర్నెట్ డెస్క్: పండుగ సీజన్‌లో బంగారం కొనుగోలు చేయాలని భారతీయులు కోరుకుంటారు. మరికొందరు బంగారంపై పెట్టుబడి పెట్టాలనుకుంటారు. ఇలాంటి వారు పసిడి, వెండి ధరల్లో హెచ్చుతగ్గులను నిశితంగా గమనిస్తుండాలి. ప్రస్తుతం దేశంలో బంగారం ధరలు ఆల్‌టైం గరిష్ఠ స్థితిలో కొనసాగుతున్నాయి. అయితే, నిన్నటితో పోలిస్తే నేడు ధరల్లో స్వల్ప తగ్గుదల కనిపించింది %గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, సోమవారం ఉదయం 6.30 గంటలకు 24 క్యారెట్ బంగారం ధర రూ.1,25,070గా ఉంది. 22 ర్యాకెట్ 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర కూడా స్వల్పంగా తగ్గి రూ.1,14,640కి చేరుకుంది. ఇక 18 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 93,800గా ఉంది. వెండి ధరలో కూడా స్వల్పంగా తగ్గుదల కనిపించింది. కిలో వెండి ధర ప్రస్తుతం రూ. 1,79,900గా ఉంది. అమెరికా-చైనా వాణిజ్య ప్రతిష్ఠంభన, సుంకాలు, పండుగ సీజన్‌లో డిమాండ్ వెరసి ధరలు మరింత పెరిగే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు.

## ఈ వారం ఆటుపోట్లలోనే



దేశీయం స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడుదొడుకులు ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు. రేర్ ఎర్త్ మెటల్స్ ఎగుమతులపై నిషేధం విధించిన చైనాపై డొనాల్డ్ ట్రంప్ టారిఫ్స్ విధించటం, ఇతర అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు సూచీలపై ప్రభావం చూపించే వీలుంది. ఈ నేపథ్యంలో మదుపరులు ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లోనే పెట్టుబడి పెట్టడం మంచిది. గత వారం నిఫ్టీ దాదాపు 2 శాతం మేర పెరిగి 25,285 పాయింట్ల వద్ద క్లోజైంది. సూచీ ఇదే స్థాయిల్లో కొన్నాళ్లు కన్సాలిడేట్ అయితే స్థిరత్వం వస్తుంది. ప్రస్తుతం నాన్ ఫెర్రస్ మెటల్స్, టెలికాం, వజ్రాభరణాలు, ఇన్‌ఫ్రా, బ్యాంకింగ్ రంగాలు బలాన్ని ప్రదర్శిస్తున్నాయి.డీఎల్ఎఫ్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. కన్సాలిడేషన్ కూడా జరుగుతోంది. ప్రస్తుతం కీలకమైన రూ.706 వద్ద మద్దతు లభించింది. స్వల్పకాల అప్‌ట్రెండ్ కొనసాగే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.740 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.825 టార్గెట్ ధరతో రూ.740 శ్రేణిలో డిప్స్ పద్ధతిలో అక్యుములేట్ చేసుకోవాలి. రూ.720 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.అదానీ గ్రీన్ ఎనర్జీ: కొన్ని నెలలుగా కన్సాలిడేట్ అవుతున్న ఈ షేరు ప్రస్తుతం స్వలకాలిక అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతోంది. ఫండమెంటల్స్ బాగున్నాయి. గత శుక్రవారం రూ.1,064 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,040 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,180 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,010 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.డాక్టర్ రెడ్డీస్: స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్‌లో ట్రయాంగిల్ ప్యాటర్న్ ఫామ్ అయ్యింది. ప్రైస్ యాక్షన్ టైట్‌గా సాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ ఇప్పుడిప్పుడే మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.1,264 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,250 శ్రేణిలో ప్రవేశించి రూ.1,4,50 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.పవర్‌గ్రిడ్: ప్రస్తుతం ఈ కౌంటర్ టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. షార్ట్‌టర్మ్ వ్యూహం తో ఇందులో పొజిషన్ తీసుకోవచ్చు. గత శుక్రవారం రూ.289 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో రూ.280 పై స్థాయిలో ప్రవేశించి రూ.315/330 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.270 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.బజాజ్ ఆటో: జీవిత కాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 45 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం స్టేజ్-2లో ఉంది. ప్రస్తుతం ఆటోమొబైల్ రంగం మూమెంటమ్‌లో ఉంది. గత శుక్రవారం రూ.8,946 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.8,850 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.9,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.8,750 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.

## ఓఎన్‌జీసీ లాభాల్లో ఎంతో మిన్న మార్కెట్ క్యాప్‌లో మాత్రం చిన్న

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) షేర్లపై మదుపరులు అంతగా మక్కువ చూపించటం లేదు. గత మూడేళ్లలో ఈ పీఎసయూ దిగ్గజం రూ.1.16 లక్షల కోట్ల లాభాలు నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరానికి చూసినా ఓఎన్‌జీసీ అనుబంధ కంపెనీలతో కలిసి (కన్సాలిడేటెడ్) రూ.38,329 కోట్లు, ఏకీకృతం (స్టాండ్‌ఎలోన్)గా చూస్తే రూ.35,610 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఇదే సమయంలో జొమాటో మాతృసంస్థ ఎటర్నల్ లిమిటెడ్ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.697 కోట్లు మాత్రమే. అయినా గత వారాంతానికి స్టాక్ మార్కెట్లో జొమాటో మార్కెట్ క్యాప్ రూ.3.37 లక్షల కోట్లుగా ఉంటే ఓఎన్‌జీసీ మార్కెట్ క్యాప్ రూ.3.10 లక్షల కోట్లు మాత్రమే.పదమూడేళ్లు వెనక్కి వెళితే దేశీయ స్టాక్ మార్కెట్లో రూ.2.44 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో ఓఎన్‌జీసీ అగ్రస్థానంలో ఉండేది. టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో ఉండేవి. ఇప్పుడు రూ.18.7 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో ఆర్ఐఎల్ అగ్రస్థానంలో, రూ.10.95 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో టీసీఎస్ నాలుగో స్థానంలో ఉన్నాయి. ఓఎన్‌జీసీ మాత్రం రూ.3.10 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో 25వ స్థానానికి పడిపోయింది.

మార్కెట్ వర్గాలు ఓఎన్‌జీసీ షేర్ల ప్రస్తుత విలువ దాని అసలు విలువను ప్రతిబింబించడం లేదంటున్నాయి. ఓఎన్‌జీసీకి ఎంఆర్‌పీఎల్ ఈక్విటీలో 71.63 శాతం, హెచ్‌పీసీఎల్ ఈక్విటీలో 54.9 శాతం, ఐఓసీ ఈక్విటీలో 14.20 శాతం, గెయిల్ ఇండియా ఈక్విటీలో 5 శాతం వాటా ఉంది. ఇవిగాక విదేశాల్లో చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తిలో ఉన్న ఓఎన్‌జీసీ విదేశ్




పూర్తిగా ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థ. ఈ సంస్థల్లో ఉన్న ఓఎన్‌జీసీ వాటాల విలువే ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం రూ.1.07 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఓఎన్‌జీసీ షేర్ల మార్కెట్ క్యాప్ మరో 33.3 శాతం పెరుగుతుంది. పీఎసయూ కావడంతోనే ఇన్వెస్టర్లు ఓఎన్‌జీసీ షేర్లను సరిగా అంచనా వేయలేక పోతున్నారని చెబుతున్నారు

## ఇంటర్నెట్ లేకున్నా ఇక చెల్లింపులు చేసెయ్యొచ్చు




ఇంటర్నెట్ డెస్క్: చేతిలో సొమ్ములేకపోయినా.. జేబులో పర్సులేకపోయినా దర్జాగా మార్కెట్లోకి వెళ్లి నచ్చిన వస్తువులు కొనుగోలు చేసి చెల్లింపులు చేయడం చూస్తున్నాం. అయితే, ఇందుకోసం పర్సులేకపోయినా ఫర్లేదు కాని, ఫోన్ మాత్రం ఉండాల్సిందే. అంతేకాదు, ఫోన్లో ఇంటర్నెట్ కూడా ఉండాలి. అప్పుడే మన ట్రాన్సాక్షన్ సక్సెస్ అవుతుంది. లేదంటే, నో ఇంటర్నెట్ అని చూపించి మిన్నకుంటుంది సదరు యాప్.అయితే, ఇప్పుడిక ఇంటర్నెట్ చెల్లింపులకు సైతం కాలం తీరిపోతోంది. మీ ఫోన్లో ఇంటర్నెట్ లేకపోయినా దర్జాగా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి నచ్చిన వస్తువులు కొనుక్కొని పేమెంట్ చేయొచ్చు. దీని కోసం భారత రిజర్వ్ బ్యాంక్ ఒక అద్భుతమైన సిస్టమ్ తీసుకొచ్చింది.భారతదేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక ముందడుగుగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ ఇండియా (%=దీ×%) వినియోగదారుల కోసం ఇంటర్నెట్ లేదా టెలికాం కనెక్టివిటీ లేకుండా లావాదేవీలు చేయడానికి వీలుగా ఆఫ్‌లైన్ డిజిటల్ రూపాయిని ఆవిష్కరించింది. ఈ సరికొత్త ఫీచర్ కేవలం ఒక ట్యాప్‌తో లేదా %ు=%తో చెల్లింపులు చేయడానికి అనుమతిస్తుంది. ఈ డిజిటల్ డబ్బు.. భౌతిక నగదు వలె సజావుగా పని చేస్తుంది.దీనికి వలె కాకుండా నియర్-ఫీల్డ్ కమ్యూనికేషన్ లేదా ఇతర సురక్షిత సామీప్య సాంకేతికతలను ఉపయోగించి రెండు డిజిటల్ వాలెట్ల మధ్య నేరుగా ఆఫ్‌లైన్ డిజిటల్ రూపాయి లావాదేవీలు జరుగుతాయి. వినియోగదారులు వారి ఫోన్ లేదా పరికరాన్ని రిసీవర్లకు నొక్కిన వెంటనే నెట్‌వర్క్ లేకపోయినా ఒక వాలెట్ నుంచి మరొక వాలెట్‌కు సొమ్ము బదిలీ అవుతుంది. దీనికి కేంద్ర బ్యాంకు ద్వారా నేరుగా మద్దతు ఇవ్వబడుతుంది. ప్రతి లావాదేవీ డిజిటల్ రూపాయి విలువలలో పూర్తి చేయబడుతుంది.ముంబైలో ముగిసిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో ఈ సరికొత్త వ్యవస్థను ప్రారంభించారు. ఇది %=దీ×% సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ప్రయాణంలో ఒక కీలక మైలురాయిని సూచిస్తోంది. దీంతో %జదీణజ% ఆఫ్‌లైన్ వెర్షన్‌ను అమలు చేసిన ప్రపంచంలోని తొలితరం దేశాలలో ఒకటిగా భారత్ నిలుస్తోంది.

## ఐదేళ్లలో 30 శాతం మహిళా ఉద్యోగులు

న్యూఢిల్లీ: రాబోయే ఐదేళ్లలో మహిళా ఉద్యోగుల సంఖ్యను 30 శాతానికి పెంచుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బావిస్తోంది. ఇందుకు అనుగుణంగా లింగ వైవిధ్యాన్ని పెంచే వ్యూహాన్ని రూపొందించింది. తమ బ్యాంకులో ఫ్రంట్‌లైన్ సిబ్బందిని చూసినట్టయితే వారిలో మహిళలు 33% ఉన్నారని, మొత్తం సిబ్బందిని చూస్తే మాత్రం 27% మాత్రమే ఉన్నారని, లింగ వైవిధ్యాన్ని మరింత మెరుగుపరచాలనుకుంటున్నామని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ (హెచ్ఆర్), చీఫ్ డెవల్‌పమెంట్ ఆఫీసర్ కిశోర్ కుమార్ పోలుదాసు చెప్పారు. పురుష, మహిళా ఉద్యోగుల శాతం లో ఈ వ్యత్యాసాన్ని తొలగించి మధ్యకాలికంగా 30% మహిళా సిబ్బంది లక్ష్యం చేరాలన్నది తమ ధ్యేయమని ఆయన తెలిపారు. ఎస్‌బీఐలో ప్రస్తుతం 2.4 లక్షల మంది ఉద్యోగులున్నారు. బ్యాంకింగ్ రంగంలోనే కాకుండా దేశంలోని ఏ ఇతర సంస్థలో అయినా గరిష్ఠ ఉద్యోగుల సంఖ్య ఇదే. మహిళా ఉద్యోగుల సౌకర్యం కోసం తమ బ్యాంక్ క్రెష్ (శిశు రక్షణ కేంద్రం) అలవెన్స్, ఫ్యామిలీ కనెక్ట్ కార్యక్రమం, మాతృత్వ సెలవుల అనంతరం తిరిగి విధుల్లో చేరే మహిళలకు శిక్షణ, సిక్ లీవ్ పెంపు వంటి పలు సౌకర్యాలు కల్పిస్తున్నదని ఆయన వెల్లడించారు. మహిళలు తమ పూర్తి సామర్థ్యాలు వినియోగంలోకి తెచ్చేందుకు వీలుగా వారికి సంపూర్ణ సురక్షిత, సమ్మిళిత వాతావరణం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎస్‌బీఐలో పూర్తిగా మహిళలే నిర్వహిస్తున్న బ్రాంచీల సంఖ్య 340కి పైగా ఉండడమే మహిళల పట్ల తమ చిత్తశుద్ధికి నిదర్శనమని కిశోర్ అన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006